



# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 25-12-2020 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 44 సంచిక : 91 పేజీలు : 8 వెల : 1 రూపాయి


# పులివెందుల రుణం ఎప్పటికీ తీరనిది

- రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గండికోట రిజర్వాయర్‌పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పనులు




కడప : పులివెందుల ప్రాంతానికి ఎంత చేసినా రుణం తీర్చుకోలేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా కడప జిల్లా పులివెందుల చేరుకున్న సీఎం రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గురువారం మధ్యాహ్నం పులివెందులలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుని.. ఆర్టీసీ బస్టాండ్, డిపోలకు శంకుస్థాపన చేశారు. అలాగే స్థానిక దేవాలయాల అభివృద్ధి, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేసి అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో చేపట్టిన కొత్త బీటీ రోడ్లకు శంకుస్థాపన నిర్వహించారు. గండికోట-సీబీఆర్, గండికోట-పైడిపాలెం లిఫ్ట్ స్కీం, 4 మోడల్ పోలీస్ స్టేషన్ భవనాల నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. గండి ఆంజనేయస్వామి క్షేత్రంలో అభివృద్ధి పనులకు సీఎం ప్రారంభించారు.

**పులివెందులలో మోడల్ పోలీస్ స్టేషన్**

ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగించారు. వచ్చే ఫిబ్రవరిలో వైఎస్ఆర్ వైద్య కళాశాల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు 5 సబ్‌స్టేషన్ల ఏర్పాటు చేయనున్నామన్నారు. యురేనియం బాధిత గ్రామాల్లో సాగు, తాగునీటి పనులు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. జేఎన్టీయూ ఇంజినీరింగ్ తరువాయి 2లో..

# ఆత్మనిర్భర్ ఆలోచన కూడా అక్కడిదే

## విశ్వ భారతి విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల్లో ప్రసంగించిన మోదీ



కోల్‌కతా: విద్యాసంస్థలు దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన సిద్ధాంతపరమైన ఉద్యమాలకు కొత్త శక్తిని ఇచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం పశ్చిమ బెంగాల్‌లోని శాంతినికేతన్‌కు చెందిన 'విశ్వ భారతి విశ్వవిద్యాలయ' శతాబ్ది వేడుకల్లో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఈ క్రమంలో నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ దేశానికి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.

విశ్వ భారతి వంద సంవత్సరాల ప్రయాణం చాలా ప్రత్యేకమైందని మోదీ అభివర్ణించారు.

ఈ విద్యాసంస్థ గురుదేవ్ దూరదృష్టి, కృషికి నిదర్శనమని ఆయన అన్నారు. అంతర్జాతీయ సౌరకూటమి, పారిస్ ఒప్పందం ద్వారా పర్యావరణ లక్ష్యాలను సాధించడానికి సరైన మార్గంలో ప్రయాణిస్తున్న ఏకైక దేశం మనదేనని ఈ సందర్భంగా ప్రధాని వెల్లడించారు. రవీంద్రనాథ్ మార్గదర్శకత్వంలో దేశంలో జాతీయవాద భావనలను పెంపొందించే ందుకు ఈ సంస్థ దోహదం చేసిందన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కూడా ఈ సెంటిమెంట్ నుంచి వికసించిన ఆలోచనేనని వెల్లడించారు. విశ్వ భారతి ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులను మనం గుర్తుంచుకోవాలని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగ్‌దీప్ ధనకర్, కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ కూడా పాల్గొన్నారు.

# చట్టాల్ని రద్దుచేసే దాకా.. ఉద్యమం ఆపరు

## రాష్ట్రపతిని కలిసిన రాహుల్ గాంధీ బృందం



దిల్లీ: నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేసేదాకా అన్నదాతలు తమ ఉద్యమాన్ని ఆపబోరని, ఈ విషయాన్ని ప్రధాని మోదీ అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. సాగు చట్టాలపై గురువారం ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిశారు. పార్టీ సీనియర్ నేతలు గులాం నబీఆజాద్, అధీర్ రంజన్ చౌధురీతో కలిసి రాష్ట్రపతిని కలిసిన రాహుల్.. దేశవ్యాప్తంగా సేకరించిన రెండు కోట్ల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సాగు చట్టాలపై జోక్యం చేసుకోవాలని కోరారు. రాష్ట్రపతి భవన్ నుంచి బయటకు వచ్చిన అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు.

'సాగు చట్టాలపై రైతులు చట్టబద్ధంగానే నిరసనలు తెలుపుతున్నారు. చట్టాలను వెనక్కి తీసుకునే వరకు వారు దిల్లీ వదిలివెళ్లరు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ అర్థం చేసుకోవాలి. వ్యవసాయ రంగంపైనే కోట్ల మంది ఉపాధి ఆధారపడి ఉంది. అలాంటి రంగాన్ని నాశనం చేస్తున్నారు. సాగు చట్టాలను ప్రభుత్వం తప్పుడు పద్ధతుల్లో ఆమోదింపజేసుకుంది. ప్రధాని రైతుల కోసం కాకుండా కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నారు. కేవలం ఇద్దరు ముగ్గురు పారిశ్రామికవేత్తల కోసం దేశాన్ని కష్టాల్లోకి నెడుతున్నారు. పెను విధ్వంసానికి దారితీసే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గళమెత్తే తరువాయి 2లో..

# మహానేత వైఎస్సార్‌కు సీఎం జగన్ ఘన నివాళి

ఇడుపులపాయ: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం ఉదయం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు అర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఆ తర్వాత ఇడుపులపాయలోని ప్రార్థన మందిరం లో కుటుంబ సభ్యులతో కలిసి సీఎం జగన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడ నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకల్లోతల్లి విజయమ్మ ,సతీమణి భారతి రెడ్డితో కలిసి సీఎం జగన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి,డిప్యూటీ సీఎం అంజాద్ భాష,ఇంచార్జ్ మంత్రి ఆదిమూలపు సురేష్, చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్ కొండారెడ్డి , వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం చిరువ్యాపారులకు
# ఆర్థిక వెసులుబాటు ఇచ్చేందుకు జగనన్న తోడు

**జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్**



విశాఖపట్నం : జగనన్న తోడు కార్యక్రమం లో జి.వి.ఎం.సి పరిధిలోని చిరువ్యాపారులకు రుణాలు మంజూరు లక్ష్యాలను చేరుకోవడానికి జోనల్ కమిషనర్లు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ అన్నారు. గురువారం నాడు స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జగనన్న తోడు కార్యక్రమం పై జి.వి.ఎం .సి అధికారులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనాథ్, డి ఆర్ డి ఎ పి డి విశ్వేశ్వరరావు ల తో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిరువ్యాపారులకు ఆర్థిక వెసులు బాటు ఇచ్చేందుకు జగనన్న తోడు కార్యక్రమం అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు కార్యక్రమ లక్ష్యాలను పూర్తి చేయడానికి నిర్థిష్ట కార్యచరణ ప్రణాళిక ప్రకారం పని చేయాలని బ్యాంకర్లకు స్పష్టం చేసిందని తెలిపారు. పెండింగ్ లో నున్న ధరఖాస్తులను సత్వరమే బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కరించడానికి జోనల్ కమిషనర్లు శ్రద్ధ వహించాలని కోరారు. జోనల్ కమిషనర్లు వారి పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో పెండింగ్ లో ఉన్న ధరఖాస్తులపె సంప్రదించాలని కోరారు. జి.వి.ఎం .సి పరిధిలోని 8 జోన్లలో పెండింగ్ లో ఉన్న 14,000 ధరఖాస్తుదారులకు సత్వరమే రుణాలు మంజూరు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే వై ఎస్ ఆర్ భీమా పథకంలో ధరఖాస్తు దారుల తరుపున ప్రభుత్వం భీమా ప్రీమియం ను చెల్లించిందని , ధరఖాస్తులను ప్రాసెస్ చేయించి ఆయా వ్యక్తులకు ఇన్సూరెన్స్ పాలసీ డాక్యుమెంట్ లను అందించడానికి జోనల్ కమిషనర్లు భాద్యత తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జి.వి.ఎం .సి కమిషనర్ జి.సృజన , జాయింట్ కలెక్టర్ గోవిందరావు, డి ఆర్ డి ఎ పి డి విశ్వేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనాథ్ జోనల్ కమిషనర్లు, యు సి డి పిడి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్నేహలత హత్యపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశం

## రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



అనంతపురం : దారుణ హత్యకు గురైన స్నేహలత కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పరామర్శించారు. మృతదేహానికి నివాళులు అర్పించిన వాసిరెడ్డి పద్మ... బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'వైద్య విద్యార్థిని రిసితేశ్వరి చనిపోతే కేసు కూడా నమోదు చేయని చరిత్ర చంద్రబాబు నాయుడిది. అలాంటిది తరువాయి 2లో..

# పేదల సొంతింటి కల నిజం చేయనున్న సీఎం వైయస్ జగన్

- -30.75 లక్షల మంది పేదలకు రేపు పట్టాల పంపిణీ పండుగ
- - 15.60 లక్షల ఇళ్ల నిర్మాణానికి రేపు శంఖుస్థాపన
- - లేఅవుట్లతో రాష్ట్రంలో కొత్తగా 17,000 గ్రామాలు, టౌన్‌షిప్పులు రాబోతున్నాయ్
- - రూ. 85 వేల కోట్ల విలువైన ఆస్తిని 30 లక్షల మంది పేదలకు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం
- -300 చ.అ. టిడ్కో ఇళ్లను ఒక్క రూపాయికే లబ్ధిదారులకు అందజేత
- -కోర్టుల్లో టీడీపీ కేసులు వేసి స్టేలు తేవటం వల్లే పట్టాల పంపిణీ ఆలస్యం
- -365 చ.అ, 430 చ.అ. టిడ్కో ఇళ్ల అడ్వాన్స్‌ల్లో సగం రాయితీని ప్రభుత్వం భరిస్తుంది
- -అనంతపురంలో యువతి హత్యను చంద్రబాబు రాజకీయం చేయటం హేయం?
- - భూముల రీసర్వే దోచుకోవడానికే అని గ్రామాల్లోకి వెళ్ళి మాట్లాడితే టీడీపీ నేతల్ని ప్రజలే తరిమికొడతారు
- - టీడీపీ భూకబ్జాల గురించి మాట్లాడలేకే.. ప్రభుత్వంపై చంద్రబాబు నేలబారు విమర్శలు
- - చంద్రబాబుకు అసలు ఆంధ్రప్రదేశ్‌లో ఇల్లు ఉందా? అడ్రస్ ఉందా?
- -పేదవారు పేదవారిగానే ఉండాలనేది టీడీపీ విధానం.. అందుకే టీడీపీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు
- -రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 25 నుంచి జనవరి 7వరకు పదిరోజులు పాటు పండుగలా ఇళ్ళ పట్టాల కార్యక్రమం

**పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ** వార్త 7లో..



# విశాఖ డైరీ పాడిరైతులను ఆదుకోవడమే లక్ష్యం : ఆడారి ఆనంద్



సబ్బవరం : విజయ విశాఖ డైరీ పాడి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డైరీ వైస్ చైర్మన్ ఆడారి ఆనంద పేర్కొన్నారు మండల కేంద్రంలో సబ్బవరం డైరీ పాయింట్ లో గురువారం డైరెక్టర్లు రైతుల సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైస్ చైర్మన్ ఆనంద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ విశాఖ డైరీ పాడి రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు డైరీ అభివృద్ధికి కృషి చేయాలని రైతులను కోరారు రైతుల పిల్లల కోసం ఫిజియోథెరఫీ డిప్లమో కోర్సులను డైరీ స్కూల్ లలో ఉన్నాయని 450 మంది రైతులు పిల్లలు విశాఖ డైరీ స్కూల్లో చదువుతున్నారు డైరీ హాస్పిటల్లో 150 బెడ్ లు ఉన్నాయన్నారు 35 కోట్లతో క్యాన్సర్ యూనిట్ పెడతామన్నారు.

రైతులకు నెలరోజుల్లో 350 ఆవులను ఇచ్చామన్నారు నాణ్యమైన ఆవుల్ని 5000 2021లో ఇస్తామన్నారు రైతుల పిల్లలకు డైరీ లో ఉద్యోగాలు ఇస్తామన్నారు ప్రతి రైతుకు కళ్లల్ల దగ్గర హ్యాండ్ బోరింగ్ వేస్తామన్నారు 43 రకాల తో బ్రెడ్ బిస్కెట్లు విశాఖ డైరీ ద్వారా ఉత్పత్తులు తయారవుతున్నాయి అన్నారు డైరీ కి మీ అందరి సహాయ సహకారాలు అందించాలని కోరారు రైతు చనిపోతే లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ ద్వారా ఇస్తామన్నారు ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తాం అన్నారు.

అనంతరం నంగినారపాడు రైతు చనిపోతే కుటుంబసభ్యులకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శరగడం శంకర్రావు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు కర్మాగారం మిగులు భూములను పోస్కోకు ఇవ్వడం దారుణం



గాజువాక : స్టీల్ ప్లాంట్ స్థాపించడానికి 32 వేల ఎకరాలు ఇచ్చిన నిర్వాసితులకు ఇంటికొక ఉద్యోగం ఇస్తామని చెప్పి ఇప్పటికి హామీలను నెరవేర్చకుండా పోస్కో అంటూ కొత్త కంపెనీకి మిగిలిన భూములను పోస్కో కంపెనీకి స్టీల్ యాజమాన్యం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడం పట్ల నిర్వాసిత నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొందని, ప్రైవేటు పరిశ్రమల వలన స్థానిక లో నిరుద్యోగ సమస్య మొదలైందని, నిరక్షరాస్యులైన నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందని తెలుగు యువత ఉపాధ్యక్షులు మొల్లి పెంటి రాజు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గాజువాక తేదేపా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పెంటి రాజు మాట్లాడుతూ 9000 ఆర్ కార్డులు ఉన్న నిరుద్యోగులకు తక్షణమే స్పెషల్ రిక్రూట్మెంట్ పెట్టి ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని, ముందుగా నిర్వాసితులుతో చర్చించి వారి అభిప్రాయాలని తెలుసుకోవాలని ఉక్కుయజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మేము మా భూములను స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం విస్తరణ కోసం స్టీల్ ప్లాంట్ లో ఉద్యోగాలు వస్తాయని గత ప్రభుత్వాలు మాతో ఒప్పందాలు చేసుకొని ఇప్పుడు మిగులు భూములను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగులు భూములను ముందుగా నిర్వాసితులైనమాకు ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్ లో ఉద్యోగం వచ్చేవరకు హక్కు కల్పించాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదని మండిపడ్డారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని, అలాగే గంగవరం పోర్టు కు సుమారు 2,000 ఏకరాలు స్టీల్ ప్లాంట్ భూములు ఇచ్చి ఏ ఒక్క ఆర్ కార్డు నిర్వాసితులు కు ఉద్యోగ బరోసా కల్పించలేదని, గంగవరం పోర్టు వలన కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నా గంగవరం గ్రామాన్ని తరలించి స్టీల్ ప్లాంట్ మిగులు భూముల లో 400 ఎకరాలను గంగవరం గ్రామానికి ముందుగా కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరక్షరాస్యులైన నిర్వాసిత యువకులకు స్టీల్ ప్లాంట్ నందు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలి, లేనియెడల స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల తరపున పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఇలా భూములను ప్రైవేట్ పరిశ్రమలకు దారాధత్తం చేయడం సబబు కాదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్ పై చిత్తశుద్ధి ఉంటే సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్ విస్తరణకు నిధులు కేటాయించాలని తెలుగు యువత ఉపాధ్యక్షులు మొల్లి పెంటి రాజు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ నిర్వాసిత 64 గ్రామాలులో, అన్ని గ్రామ సంఘాలు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంఘాలు, రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలతో అఖిలపక్ష సమావేశాన్ని విశాఖ పార్లమెంట్ కమిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

ఈ ఉద్యమాన్ని తీవ్రస్థాయిలో చేపడతామనన్నారు.

ఈ కార్యక్రమంలో దానయ్య, కదిరి భూలోక, మసేను, కన్నయ్య , కదిరి శీను, నర్సింగరావు, పల్లా పెంటారావు, పితాని రాజేష్, చొప్పా, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి గిరిజన సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొయ్యూరు : శ్రీఅల్లూరి సీతారామరాజు గిరిజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి మాట్లాడుతూ నా భర్త శ్యామల మారిచరరావు స్టీల్ ప్లాంట్ జ్ఞాపకార్థం గా సంఘం పేరు మీద క్యాలెండరు విడుదల చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలతో పేదలకు సంఘం అండగా నిలుస్తుందని ,పేదలకు సేవ చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని ,సేవచెయ్యడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.

ఈ కార్యక్రమంలో...

జెఎసి బూరుగులయ్య, గ్రామ పెద్దలు పాడుగు. చందర్రావు, లువ్వా రామారావు, పాడుగు రాజుబాబు, రుత్తల శివ, కాకురు. రాజులమ్మ, పాడి.దేవి, మంట రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దళిత యువతి స్నేహాలతపై జరిగిన హత్యను తీవ్రంగా ఖండించిన గంటా నూకరాజు

భీమునిపట్నం: అనంతపురం జిల్లాలో దళిత యువతి స్నేహాలత (20)పై జరిగిన హత్య ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అధ్యక్షుడు గంటా నూకరాజు అన్నారు. డిగ్రీ చదువుతుండగా వ్యక్తిగత కారణాలు వలన రెండో సంవత్సరంలో చదువు మధ్యలో ఆపేసి ఔట్ సోర్సింగ్ విభాగంలో ధర్మవరం స్టేట్ బ్యాంకు లో ఉద్యోగం చేసుకుంటున్న దళిత యువతిపై ఇలాంటి దారుణం జరగడం చాలా బాధాకరమని గంటా నూకరాజు అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ఎవరైతే దీనికి బాద్యులో వారిపై కఠినమైన కేసులు నమోదు చేసి శిక్షించాలని, అప్పుడే మరలా ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయని అన్నారు. పోలీస్ లు కూడా ఇలాంటి సంఘటనలు జరిగేటప్పుడు నిందితులు ఎంతటి వారైనా, ఎలాంటి బేగ్రౌండ్ ఉన్నవారయినా కఠినమైన చట్టాలు అమలయ్యే విధంగా చేసినట్లయితే అల్లరిమూకలకు భయం పుడుతుందని అన్నారు. సశ్యశ్యామలమైన, ప్రశాంతమైన ఆంధ్రప్రదేశ్ లో ఇలాంటి సంఘటనలకు తావివ్వకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ. మధ్య కాలంలో దళితులపై ఇలాంటి సంఘటనలు జరగడం చూస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ అంటే దేశంలోనే శాంతికి చిరునామా అని, రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలని అందుకు పోలీస్ వారు, ప్రభుత్వం తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

# శ్రీవారి భక్తురాలికి తనే వాహనమయ్యాడు..

***- సొమ్మసిల్లి పడిపోవడంతో తన వీపు మీద 6 కి.మీ మోసుకెళ్లిన కానిస్టేబుల్ అర్షద్***

***- అనంతరం ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తరలింపు***



రాజంపేట టౌన్: శ్రీవారి దర్శనానికి వెళుతూ సొమ్మసిల్లి పడిపోయిన ఓ భక్తురాలిని ఆరు కి.మీ. మోసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పిం నాగేశ్వరమ్మను మోసుకెళుతున్న అర్షద్ చాడో పోలీస్. వైఎస్సార్సీపీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి పుపాదం సమీపంలో సొమ్మసిల్లి పడిపోయిం అమర్నాథ్ రెడ్డి ఇటీవల చేపట్టిన తిరుమల ది. నాగేశ్వరమ్మకు సంబంధించిన ఇద్దరు పాదయాత్ర విధుల్లో స్పెషల్ పార్టీ పోలీస్ మాత్రమే ఆమె వద్ద ఉన్నా.. వారు ఆమెను షేక్ అర్షద్ పాల్గొన్నారు. ఇదే పాదయాత్రలో మోసుకెళ్లలేని స్థితిలో ఉన్నారు. ఆ సమ నందలూరు మండలానికి చెందిన 58 ఏళ్ల యంలో చాలా ముందు వెళుతున్న ఆర్షదకు మంగి నాగేశ్వరమ్మ కూడా శ్రీవారిని దర్శిం ఈ సమాచారం తెలియడంతో వెనక్కి చుకునేందుకు పయనమైంది. మంగళవారం వచ్చారు. ఆమెను వీపుపై ఎక్కించుకుని ఆరు అన్నమయ్య కాలిబాట మార్గాన పాదయా కి.మీ దూరంలో ఉన్న రోడ్డు మార్గం వరకూత్ర సాగింది. అంతా కొండ మార్గం కావడంతో మోసుకెళ్లి, ప్రత్యేక వాహనంలో తిరుమ నాగేశ్వరమ్మ కొండ ఎక్కలేక హైబీపీతో గుర్ర లలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

# గుండె ఆపరేషన్ బాధితుడ్ని ఆదుకున్న వాసుపల్లి



పూర్ణామార్కెట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ 39వార్డ్ ఫెర్రీ రోడ్ లో నివసిస్తున్న వంకా నాగమణి కుమారుడు నూకరాజు, 11 సంవత్సరాల వయస్సు కలిగిన అబ్బాయికి ఓపెన్ హార్ట్ ఆపరేషన్ ను ఎటువంటి ఖర్చు లేకుండా తెల్ల రేషన్ కార్డ్ లో పేరు లేనప్పటికీ పేరు నమోదు చేయించి ఉచితంగా ఆపరేషన్ చేయించినందుకు ఎమ్మెల్యే వాసుపల్లి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మందుల నిమిత్తం రూ.3,000/- లు ఆర్థిక సహాయం చేసి అక్కడ ప్రజల మన్నలను పొందారు. ఈ కార్యక్రమంలో 39వార్డ్ కార్పొరేటర్ అభ్యర్థి కొల్లి సింహాచలం, టీ ఎల్ ఫ్ లీడర్ బేహారా వెంకటరత్నం, మాజీ యూత్ ప్రెసిడెంట్ విళ్లూరి భాస్కర రావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# హైస్కూల్‌కు ఇన్వెర్టర్ వితరణ

నాతవరం : నాతవరం మండలం డి.యర్రవరం హైస్కూల్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు సంయుక్తంగా సొంత నిధులతో ఇన్వెర్టర్‌ను హెచ్ఎం వి.శిరీషకు అందజేశారు. గతంలో హైస్కూల్‌కు చెందిన ఇన్వెర్టర్, ఇతర సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. నాటి నుంచి హైస్కూల్‌కు విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు కంప్యూటర్‌లో ఆన్‌లైన్ పనులు జరగడం లేదు. ఈ హైస్కూల్‌లో 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ సమస్యపై దృష్టిసారించిన స్థానిక విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సంయుక్తంగా చందాలు వేసుకొని రూ.25వేలు విలువ చేసే ఇన్వెర్టర్‌ను కొనుగోలు చేసి హైస్కూల్‌కు అందజేశారు.

**మొదటి పేజీ తరువాయి**

# పులివెందుల రుణం ఎప్పటికీ తీరనిది

కాలేజీలో అదనపు భవనాలను నిర్మిస్తామని తెలిపారు. 'వేంపల్లిలో డిగ్రీ కాలేజీకి నూతన శాశ్వత భవనాలను ఏర్పాటు చేస్తాం. నల్లపల్లిచెరువుపల్లిలో 130 కేవీ సబ్ స్టేషన్‌తో 14 గ్రామాలకు మంచి జరుగుతుంది. వేంపల్లిలో కమ్యూనిటీ ఆస్పత్రిని 30 పడకల నుంచి 50 పడకలకు పెంచుతున్నాం. పులివెందులలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు జరుగుతున్నాయి. 18 కొత్త దేవాలయాలు, 51 దేవాలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వేంపల్లి ఉర్దూ కళాశాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పులివెందులలో మోడల్ పోలీస్ స్టేషన్ పనుల పురోగతి మరింత వేగవంతంగా సాగుతున్నాయి.

**పునరావాసంకు రూ. 665 కోట్లు..**

గండికోట రిజర్వాయర్‌పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మార్చిలో ప్రారంభిస్తాం. రూ.1256 కోట్లతో మైక్రో ఇరిగేషన్ పనులు చేపడుతున్నాం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటే తప్ప పోతిరెడ్డిపాడుకు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం రాదు. గత 15 ఏళ్లలో లెక్కలు చూస్తే 20-25 రోజుల మాత్రమే పూర్తిస్థాయి నీరుంది. పులివెందుల ఆర్టీసీ డిపో పనులు డిసెంబర్ 25న ప్రారంభం కానున్నాయి. గండి వీరాంజనేయ క్షేత్రంలో గర్భాలయం, ధ్వజస్తంభం పునర్నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. గండికోటలో రిజర్వాయర్‌లో 26 టీఎంసీల పూర్తిసామర్థ్యాన్ని ఎప్పుడూ నింపలేదు. రూ.665 కోట్లతో పునరావాసం చెల్లించి 26.85 టీఎంసీల నీటిని నింపాం. రూ.247 కోట్లు కింద ఇచ్చి చిత్రావతిలో 10.13 టీఎంసీల నీటిని నింపాం. గండికోట, చిత్రావతి నిర్వాసితులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వారి త్యాగాల వల్లనే లక్షలాది రైతులకు మేలు జరుగుతుంది. నిర్వాసితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నాను. నిర్వాసితులు చిరునవ్వుతో ఉండేలా చర్యలు తీసుకోవాలి.' అని అన్నారు.

## చట్టాల్ని రద్దుచేసే దాకా.. ఉద్యమం ఆపరు

వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. మోదీ నిర్ణయాలతో కోట్ల మంది జీవితాలు రోడ్డున పడుతున్నాయి. సాగు చట్టాలను వెనక్కి తీసుకోకపోతే దేశం ఇబ్బందుల్లో పడుతుంది. వెంటనే పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరిచి చట్టాలను రద్దు చేయాలి' అని రాహుల్ ప్రధానిపై ధ్వజమెత్తారు.

## స్నేహలత హత్యపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశం

స్నేహలత హత్యపై టీడీపీ రాజకీయాలు చేస్తోంది. హత్య ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించాం. దిశ చట్టం ద్వారా వారం రోజుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు అవుతుంది. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటాం.' అని తెలిపారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ...స్నేహలత హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం, మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. మరోవైపు ఈకేసులో నిందితులు ఉన్న రాజేష్, కార్తీక్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

# రైల్వే డిఆర్ఎం కు వినతి పత్రం



రైల్వే న్యూ కాలనీ: 31పాత/42కొత్త వార్డ్ రైల్వే న్యూ కోలనీ లో శ్రీ పరదేశమ్మ అమ్మ వారి ఆలయానికి రైల్వే క్వార్టర్స్ గోడ మార్గం గుండా వెళ్లే 5అడుగుల మార్గాన్ని రైల్వే అధికారులు మూసివేస్తున్న కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానికుల ద్వారా తెలియగానే వెంటనే ఎమ్మెల్యే వాసుపల్లి స్పందించి సంబంధిత స్థలానికి వెళ్లి ప్రజలకు భరోసా ఇచ్చి తదుపరి విశాఖ పార్లమెంటు సభ్యులు ఎమ్.వి.వి. సత్యనారాయణతో కలిసి రైల్వే డి.ఆర్.ఎమ్. చేతన్ కుమార్ ను డి.ఆర్.ఎమ్ వారి కార్యాలయంలో కలిసి మాట్లాడి వినతి పత్రాన్ని ఇచ్చి అక్కడ ప్రజలకు న్యాయం చేయాలని కోరిన విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్. ఈ ఈ కార్యక్రమంలో లో 42వార్డ్ ప్రెసిడెంట్ జుబేర్, 32వార్డ్ ప్రెసిడెంట్ మూలే రామిరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ఆళ్ల శివ గణేష్, స్థానికులు భాషా, సురేష్ తదితరులు హాజరయ్యారు.



*హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా గుడికో గోమాత కార్యక్రమంలో 32 ఆవులను, దూడలను, మరియు ఒక నందీశ్వరున్ని టీటీడీ గోశాలకు దానం చేసిన టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వారి ధరపత్ని స్వర్ణలతమ్మ .*

# ఈసారికి ఇంతే!

అహ్మదాబాద్ : ఐపీఎల్- 2022 సీజన్‌కు సంబంధించి బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 8 జట్లతో పాటు అదనంగా మరో రెండు టీమ్‌లను కొత్తగా చేర్చనుంది. దీంతో మొత్తంగా 10 జట్లు ఈ మెగాటోర్నీలో టైటిల్ కోసం తలపడనున్నాయి. ఈ మేరకు గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. కాగా కరోనా కాలంలోనూ బీసీసీఐ, ఇండియన్ ప్రీమియర్ లీగ్ 13వ సీజన్‌ను విజయవంతంగా పూర్తిచేసిన సంగతి తెలిసిందే. కాస్త ఆలస్యంగా ప్రారంభమైనా క్యాష్ రిచ్ లీగ్ క్రికెట్ ప్రేమికులకు కావాల్సినంత మజా అందించింది. యూఏఈ వేదికగా జరిగిన ఈ మెగాటోర్నీలో ముంబై ఇండియన్స్ మరోసారి ట్రోఫీ కైవసం చేసుకుంది. ఇక గత నెలలో ఐపీఎల్-2020కి శుభం కార్డు పడిన నాటి నుంచి వచ్చే సీజన్‌లో 10 జట్లను ఆడిస్తారంటూ ప్రచారం జరిగిన విషయం విదితమే. అయితే వచ్చే ఏడాది ఐపీఎల్‌కు చాలా తక్కువ సమయం ఉండటంతో టెండరింగ్ ప్రక్రియ, మెగా వేలం నిర్వహించడం కష్టతరమని బీసీసీఐ పెద్దలు భావించిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా ఐపీఎల్ చరిత్రలో 2011, 2012, 2013 మినహా ఇంతవరకు ఏ సీజన్‌లోనూ 9 కంటే ఎక్కువ జట్లు బరిలోకి దిగలేదు. ఇక 2022లో 10 జట్లు, 94 మ్యాచ్‌లతో బిగ్ టోర్నమెంట్ చూడవచ్చని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. ఒలింపిక్స్(2028)లో క్రికెట్‌ను చేర్చాలన్న అంశంపై ఈ సమావేశంలో విస్తృత చర్చ నడుస్తున్నట్లు సమాచారం.

## ఘనంగా
# జాతీయ వినియోగదారుల దినోత్సవం




సింహాచలం : జాతీయ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వినియోగదారుల హక్కుల సంస్థ చినగదిలి మండల కన్వీనర్ విజినిగిరి. బాల భానుమూర్తి ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్ లో గల బంగారుతల్లి వృద్ధాశ్రమంలో గల వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలభానుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్క వినియోగదారుడు తప్పనిసరి వస్తువు కొనుగోలు చేసినపుడు డిమాండ్ చేసి బిల్లు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో....

సీఆర్ఓ 67వ వార్డు అధ్యక్షుడు కుప్పిలి.వరహా సంతోష్, మరియు వృద్ధులు పాల్గొన్నారు.

# తూర్పు కాపు కార్పొరేషన్ సంక్షేమానికి కృషి చేస్తాం....

## అభినందన సభలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్





కంచరపాలెం : తూర్పు కాపు కార్పొరేషన్ సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ తూర్పు కాపు కార్పొరేషన్ సంక్షేమ మరియు అభివృద్ధి చైర్మన్ గా నియమితులైన మామిడి శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం అనంతరం పలువురు కాపు కార్పొరేషన్ సంక్షేమ సంఘం సభ్యులు ఆర్ .అండ్ .బి కూడలి వద్ద వుడా కమ్యూనిటీ భవనంలో గురువారం ఉదయం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వైసీపీ ప్రభుత్వం బి.సి కులాలకు పెద్ద పేట వేస్తూ 139 కులాలని 56 కార్పొరేషన్ లు గా చేసి 672 డైరెక్టర్లను నియమించటం అబినందనుయమన్నారు. బీసీ కార్పొరేషన్లను 56 గా చెయ్యటం వలన బీసీ సంక్షేమానికి నిధులు పక్క దారి పట్టే అవకాశం వుండదన్నారు. దేశ జనాభాలో బీసీ లు రెండవస్థానంలో ఉందన్న ఆయన 13 జిల్లాలో బి.సి కార్పొరేషన్ సభ్యులను సమన్వయ పరుస్తూ ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అంతకు ముందు సభ ప్రాంగణానికి చేరుకున్న ఆయన సమీపంలో ఉన్న విగ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు కాపు కార్పొరేషన్ సంక్షేమా సంఘం ప్రతినిథులు పుష్ప గుచ్ఛలతో అభినందనలు తెలియజేసి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పాల్గున్న వైజగ్ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీను బాబు ఆయనకు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో బాబురావు జియ్యాని శ్రీధర్ బాణాల శ్రీను ఆనందరావు అలజంగి ప్రకాష్ రావు గొర్లె శ్రీనివాసులు నాయుడు, అనంతరం ఆర్అండ్బి కూడలి నుండి పెద్ద ఎత్తున ర్యాలీగా బయలు దేరివెళ్ళారు.

# సబ్బవరం లో వైసీపీ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే అధీప్‌రాజు

సబ్బవరం : మండల కేంద్రంలో హంస హొండా మేడపైన అనకాపల్లి రోడ్డు లో గురువారం వైసిపి కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే అధీప్‌రాజ్ ఈ కార్యక్రమంలో తుంపాల అప్పా రావు, సబ్బవరపు నారాయణ మూర్తి, బీసీ సెల్ అధ్యక్షుడు కొట్టనా రాము, వనం అచ్చిం నాయుడు, వడ్డాది అప్పలరాజు, కర్రీ బాబు, కాపు సెట్టి శేషు, గవర శ్రీను, మండల సముద్రం, గొర్లె అచ్చిం నాయుడు, ఉల్లి పెంటయ్య, ధనిమి రెడ్డి శ్రీను, గొంప దేముడు, సబ్బవరపు సత్య నారాయణ, వైసీపీ మహిళా నాయకురాలు బంతి కోల పద్మ, పల్ల కృష్ణ, పరవాడ రమణ, ఆటో శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## సింహాచలంలో ఘనంగా నేషనల్ కన్స్యూమర్ డే కార్యక్రమం



సింహాచలం : నేషనల్ కన్స్యూమర్ డే సందర్భంగా సింహాచలం గోశాల దగ్గర లక్ష్మీనరసింహ వోకర్స్ కు విశాఖపట్నం జిల్లా అర్గనెగింగ్ శక్రటరీ లోగిశ గణేష్, సెక్రటరీ రామకృష్ణ లు వినియోగదారు ల సేవలు గురించి వివరించాడం జరిగినది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్స్ వికాస్ పాండే, గొర్లె శ్రీనివాస్ నాయుడు గారు ఆదేశాలు మేరకు జరిగింది. ఈ కార్యక్రమంలో నాయుడు, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీజేపి ఆధ్వర్యంలో
# రైతు అవగాహన సదస్సు



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో నున్న కింగ్స్ పంక్షన్ హాలులో ఈ రోజు 10 గంటలకు.జరగనున్న రైతు అవగాహన సదస్సులో భారతీయ జనతాపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డా.దగ్గుబాటి పురంధేశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించిస్తారని భీమిలి భాజపా నాయకులు అన్నారు. భీమిలి భాజపా కార్యాలయంలో భీమిలి భాజపా ఇన్చార్జ్ ప్రమోద్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో భీమిలి కోఆర్డినేటర్ కంటుభుక్త రామానాయుడు, సీనియర్ నాయకులు ఉప్పాడ అప్పారావు ,నగర కార్యదర్శి వాసుపల్లి శ్రీహరి, మూడో వార్డు భాజపా కార్పొరేటర్ అభ్యర్థి కంటుభుక్త సునీత , పాల్గొని ఈ రోజు జరగనున్న రైతు సదస్సును జయప్రదం చేయాలని అన్నారు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లు-2020 చట్టం పై రైతులకు పురంధేశ్వరి సంపూర్ణ అవగాహన కల్పిస్తారని, కాబట్టి రైతులు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని, తెలిపారు.ఈ సమావేశంలో కనకల కళ్యాణి, ఉడికల రాజు, మల్లేటి మహేష్ వర్మ, తోనంగి రాము, గండిబోయిన సాదూరావు, మద్దిల పద్మారావు, గుంప చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ సందర్భంగా మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ చేపట్టిన
## అనాథులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం



విశాఖపట్నం : గాడ్ మదర్ థెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ. క్రిస్మస్ పండుగ సందర్భంగా దొండపర్తి నుండి రైల్వే స్టేషన్ వరకు రోడ్డులో ఉన్న అనాథులకు రాష్ట్ర బీసీ కార్పోరేషన్ డైరెక్టర్ వైఎస్సార్‌సీపీ నాయకురాలు, సంస్థ చైర్మన్ డా.డి.భారతి లక్ష్మీతో సంస్థ ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదానం చేశారు. మదర్ థెరిసా అనాథులకు మాతృమూర్తి గా వృద్ధులకు, పిల్లలకు, వికలాంగులను చేరదీసి వారుని అదరించి అదుకోని సేవలు చేసేవారని భారతి లక్ష్మి అన్నారు. అనాదులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని సహాయం చేయాలని మానవత్వం చూపాలని వారిపై సంస్థ ద్వారా గత ఎనిమిది సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేయు చున్నామని అనాదులకు సేవా చెయ్యడంలో ఆనందం, సంతృప్తి ఉందని సంస్థ చైర్మన్ గంట్యాడ శంకర్ అన్నారు.

ఈ అన్నదానం కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వైస్ చైర్మన్లు బొత్స దేముడు, మన్నం లక్ష్మి పూజ. కార్యదర్శి అప్పటి,చిన్న విలియం, కోశాదికారి జి.శాంతి కుమారి, ఆర్గనైజర్లు కాళ్ళ శ్రీనివాస్, కె.లక్ష్మి కాంతం,శిరిసిల రమణ, కె.శాంతి,జె.రాజు, నూక రత్నం,చంద్రకళ, ఎ.విజయ,డి.యస్. రావు, బర్రి నరేష్ పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో
## ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు



అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురంలో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం నుండి పూజలు, అభిషేకములు జరుగునని భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దాసరి లక్ష్మణరావు తెలిపారు.

### పందెంరాయుళ్ళు అరెస్టు

మాకవరపాలెం : కోడి పందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని మాకవరపాలెం ఎస్సై కరక రాము తెలిపారు. పాపయ్య పాలెం సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్టు తెలిసి వారి వద్ద నుండి రూ.8860 నగదు, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకొన్నామన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ ద్వితీయ ఏడాదిలో
## స్పాట్ అడ్మిషన్లకు ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన
# విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం : ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సు ల్లో (ఒకేషనల్ కోర్సు) ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి పాలిటెక్నిక్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరంలో మిగిలిన ఖాళీ సీట్లకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భీమునిపట్నం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.శ్రీనివాసరావు తెలిపారు.

విద్యార్థులు ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుతో పాటు బ్రిడ్జి కోర్సు పూర్తి చేసి డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరదలచిన విద్యార్థులు 26వ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోగా తమకు కావాల్సిన కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ నెల 29న స్పాట్ కౌన్సిలింగ్ జరుగుతుందని, ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో 29న ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కంచరపాలెం, విశాఖపట్నం కు రావాలని చెప్పారు. ఈ విధంగా చేరిన వారు ఫీజు, ఇతర ప్రభుత్వ ఉపకార వేతనాలకు అర్హులు కారని, ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును వెంటనే కట్టాలని పేర్కొన్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి ని
# అదుపులోకి తీసుకున్న పోలీసులు



కంచరపాలెం : గంజాయి తరలిస్తున్న అనుమానిత వ్యక్తి ని ద్వారకా జోన్ పోలీసు లు అదుపులోకి తీసుకుని అతడి వద్ద 30 కేజీల గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం ద్వారక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధ్వారాక ఏసీపీ జెవి. ఎస్.ఎన్.మూర్తి వివరాలు వెల్లడించారు. డిల్లీ ( సౌత్ ) జగాబాయ్ ఎక్సిస్టన్, జామియా నగర్, నిజామియా నగర్ పోలీస్ స్టేషన్ పరిది ప్రాంతానికి చెందిన సాజిద్ షబ్బీర్ (28) బుదవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో గురుద్వార్ కూడలి వద్ద అనుమాన స్పంద స్థితిలో ఆరంజ్ ట్రావెల్స్ బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న సమాచారం మేరకు ద్వారకా జోన్ సిఐ అప్పరావు నేతృత్వంలో సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి సూట్ కేసు లు పరిశీలి అందులో గంజాయి ని గుర్తించారు. దీంతో అతడిని అదువులోకి తీసుకుని విచారించారు. ముద్దాయి. కోవిడ్ సమయంలో బట్టలు మరియు చైనా వస్తువుల వ్యాపారంలో నష్టాలు రావడం తో, అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో, గతంలో ఢిల్లీ లో తనకు పరి చయం అయిన అర్జున్ అనే వ్యక్తి ని కలవటానికి ఈనెల 17 ఉదయం ఇండిగో విమానం లో ఢిల్లీ నుండి విశాఖపట్నం వచ్చి,అర్జున్ ద్వార ఏజెన్సీ ప్రాంతాల నుండి గంజాయి తెప్పించుకొని, అతనికి 45, వేలు నగదు ఇచ్చి విజయనగరం జిల్లా శివారులో30 ప్యాకెట్ల గంజాయిని కొనుగోలు చేసి ఆటోలో విశాఖపట్నం తీసుకు వచ్చాడు. గంజాయి ని ఢిల్లీలో అధిక ధరలకు అమ్మెందుకు తీసుకువెళ్ళే క్రమంలో పోలీస్ లకు పట్టుబడ్డాడని వెల్లడించారు. ముద్దాయిని కోర్టు ముందు హాజరు పరిచి రిమాండు కు తరలిస్తామని సూచించారు.

## విల్లూరి తిరుమల దేవి ఆధ్వర్యంలో
# పల్లా శ్రీనుకి ఘనంగా సత్కరించి, మెమోంటో అందజేత



విశాఖపట్నం : జీవీఎంసీ 33 వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్రిస్మస్ సందర్భాన్ని పురస్కరించుకొని, డ్వాక్రా మహిళా సంఘాల గౌరవ అధ్యక్షురాలు మరియు 33 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థిని విల్లూరి తిరుమల దేవి ఆధ్వర్యంలో, తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శీనుకి, గీతం యూనివర్సిటీల అధినేత ఎం.భరత్ మరియు విల్లూరి తిరుమల దేవి, పల్లా శ్రీనుకి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో ఘనముగా సత్కరించి, మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పల్లా శీను మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి తిరుమల కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం భరత్ మాట్లాడుతూ క్రీస్తు ప్రభువు బెత్లెహేము లో జన్మించాడని,అయినా చూపిన దారిలో మనము అందరము నడవాలని ఆయన అంటూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి విల్లూరి డాక్టర్ చక్రవర్తి ,వానపల్లి రవికుమార్ ,దాసరి సత్యనారాయణ, జఫరుల్లా, చిన్న రెహమాన్,యల్లపు శ్రీను, దొడ్డిబపానందు, బోట్ట పరదేశి యాదవ్, పేక్కు సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
టెండరు నెం. 30205758, తేదీ. 16.12.2020
పని పేరు: WAP-7 త్రీ ఫేజ్ ఎలక్ట్రికల్ లోకో మోటివ్ కొరకు CLW డ్రాయింగ్ నెం. 1209-01-111-001 ప్రకారం వీల్ సెట్ యాక్సిల్ బాక్సు (గేరు రేషియా 72:20 తోటి).
RITES వారిచే తనిఖీ. (పరిమాణం-03 నెంబర్లు)
సూచన: మెటీరియల్ 120 రోజులు లోగా సరఫరా చేయాలి.
టెండరు తెరచు తేదీ మరియు సమయం:
20.01.2021
పూర్తి వివరాలు & టెండరు డాక్యుమెంట్లు లభించు వెబ్‌సైట్: http://www.ireps.gov.in.
సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్, వాల్తేరు
PR-438/L/20-21

# విజయభాను

## సంపాదకీయం

### దా'రుణ' మోసాలు'

అప్పిచ్చువాడు, వైద్యుడు, ఎప్పుడు ఎడతెగక పారు ఏరును, ద్విజుడున్..' ఉన్నట్టి ఊరులోనే ఉండాలని సుమతి శతకకారుడు ఏనాడో హితవు చెప్పాడు. కానీ నేటికాలంలో కోటి ప్రజలున్న నగరంలోనైనా సరే, ప్రతి ఒక్కరూ ఒంటరే. అప్పు అవసరమైతే ఆదుకునేవారు ఉండరు. కరోనా మూలంగా లాక్‌డౌన్ అమలవుతున్నప్పుడు చిన్న జీతగాళ్లు, చిల్లర వ్యాపారులు మొదలుకొని మధ్యతరగతి వేతన జీవుల వరకు చాలామంది డబ్బు కోసం ఇబ్బంది పడ్డారు. ఇటువంటి అత్యవసరాలను ఆసరా చేసుకొని కొందరు మోసగాళ్లు అమాయకులకు వలవేసి దోచుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా అప్పటికప్పుడు అప్పులు ఇస్తూ జీవితాలతో ఆడుకుంటున్నారు. అప్పిచ్చిన వారి ఒత్తిళ్లకు తట్టుకోలేక, పరువు కోల్పోయి కొందరు ప్రాణాలు తీసుకోవడం బాధాకరం.

నిమిషాల్లోనే రుణాలిస్తున్నామంటూ ఆకర్షించే ఈ ఆన్‌లైన్ సంస్థలు, ఒకసారి తమ చేతికి చిక్కిన తర్వాత రుణగ్రహీతలను మానసికంగా వేధిస్తూ, భయపెడుతూ డబ్బులు గుంజుతుంటాయి. ముప్పై వేల రుణం తీసుకుంటే అందులో జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు అంటూ పదివేలు కోత వేసి ఇరవై వేలు మాత్రమే ఇస్తుంటారు. వడ్డీ ముప్ఫై శాతం మేర ఉంటుంది. వారానికోసారి వడ్డీ రేటు మారుస్తూ ఉండటంతో ఎంత చెల్లించినా అప్పు తీరదు. ఆన్‌లైన్ ద్వారా యాప్‌ల ఆధారంగా రుణాలిచ్చే అనేక సంస్థలకు అసలు రిజర్వు బ్యాంక్ అనుమతే లేదు. అయినా ఇలాంటి సంస్థలు దేశవ్యాప్తంగా ఏర్పడటమే కాదు, చట్టవిరుద్ధంగా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నాయి. వీటి కార్యకలాపాలు ఎలా ఉంటాయనే దానిపై అధికార వర్గాల్లోనే స్పష్టత లేదు. నియంత్రణ అంతకన్నా లేదు. ఆసియా పసిఫిక్ దేశాలన్నింటిలోకెల్లా భారత్‌లోనే అతి ఎక్కువగా ఆన్‌లైన్ అప్పులిచ్చే యాప్‌లు ఉన్నట్టు ఇటీవల ఒక నివేదిక పేర్కొన్నది.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ వ్యాపార, మార్కెటింగ్ విధానాలు మారిపోతున్నాయి. కొత్త పరిజ్ఞానం వల్ల సౌకర్యాలు పెరుగుతున్నాయి. అదే సమయంలో మోసాలు కూడా కొత్త పద్ధతుల్లో సాగుతున్నాయి. వీటికి అనుగుణంగా చట్టాలను సవరించుకోవాలి. దర్యాప్తు విధానాలను కూడా మెరుగుపరుచుకోవాలి. కానీ కేంద్రస్థాయిలో అప్రమత్తత కొరవడిన కారణంగా, చట్టపరమైన లొసుగులను ఆధారం చేసుకొని మోసగాళ్లు తప్పించుకుంటున్నారు. నేరాలను కట్టడి చేయడంలో ఇప్పటికే పేరుపొందిన తెలంగాణ పోలీసులు యాప్‌ల ద్వారా అప్పులిస్తూ వేధిస్తున్న మోసగాళ్లపై కూడా కన్నువేసి పట్టుకున్నారు. కొందరిని అరెస్టు చేసి, వారి ఖాతాలను స్తంభింపజేశారు. ఇతర నగరాల్లో కూడా దర్యాప్తు జరగవలసి ఉన్నది. ప్రజలు కూడా ఇటువంటి ఆన్‌లైన్ సంస్థలను నమ్మకుండా జాగ్రత్తపడాలి. ఉన్నత విద్యావంతులు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన పెంచుకొని ఇతరులను హెచ్చరించాలి. చట్టాలు ఎన్ని ఉన్నా జన చైతన్యమే నేరాలకు అడ్డుకట్ట!



**విశాఖపట్నం 33వ వార్డు లో జరిగిన క్రిస్టమస్ వేడుకలు లో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్. ఈ సందర్భంగా ఆయన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి జాన్ వెస్లీ ఘనంగా సన్మానించడం జరిగింది.**

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వన్ టౌన్ : విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ 30వ వార్డులో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.స్థానిక యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి ముక్తా బత్తుల రమేష్ , జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, నీలకంఠ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైకాపా మాజీ అధికార ప్రతినిధి సీనియర్ నాయకులు జాన్ వెస్లీ విచ్చేసి క్రిస్మస్ కేకు కట్ చేశారు.ఈ సందర్భంగా ఏపీ బీసీ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ సబీరా బేగంను ఆయన సన్మానించారు. అనంతరం ఆయన క్రీస్తు పుట్టుక ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు.

## కవి సమయం

### గీతార్థం యిదిగో

- గీత ఒక కల్ప వృక్షము
- అది శ్రీ కృష్ణునిచే నాటబడినది
- వ్యాసునిచే పెంచబడినది
- ఉపనిషత్తులు దాని విత్తనములు
- జ్ఞాన ప్రభోదమే దాని అంకురం
- వివిధ శాస్త్ర రహస్యములు దాని కొమ్మలు
- విషయ విరక్తి, సహనము దాని చిగుళ్లు
- పరమాత్మ యొక్క పద్మముల పాద పద్మముల యందు
- భక్తియే దాని పుష్ప సుగంధం
- మోక్షమే దాని ఫలం
- నీవు దేవునివైపు ఒక అడుగు వేసినచో
- దైవం నీ వైపు పది అడుగులు వేయును
- నీ కర్తవ్యం నీవు చిత్తశుద్ధితో చేసినచో
- దైవం నీవు పొందవలసిన ఫలితం కన్న ఎక్కువే యిచ్చును
- కొండ గృహంలోనికి వెళ్లి అది పలుకలేదే అని తలంపకుము
- నీవు ధ్వని చేయి - అది ప్రతధ్వని చేయును
- ధనముతో వస్తువులను కొనగలము
- కాని మనఃశాంతిని కొనలేము
- ప్రలోభాలకు లొంగని మనస్సు ప్రశాంతంగా ఉంటుంది.

... కవితా రచన
శ్రీ స్వామి అప్పాజి భగవాన్

## పంచాంగం

మాసం : మార్గశిర ; తిథి : ఏకాదశి రా.1,44; అశ్విని ఉ.8.21; రా.వ.6.59ల 8.46. **శుక్రవారం 25-12-2020**

**మేషం** : వాదోపవాదాలకు దూరంగా ఉండటం మంచిది. నిరుద్యోగులకు ఒక ప్రకటన కొత్త ఉత్సాహం కలిగిస్తుంది. స్త్రీలకు ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆర్థిక స్థితి మెరుగుపడటంతోపాటు రుణ విముక్తులు అవుతారు. **వృషభం** : వస్త్ర, బంగారు, వెండి వ్యాపారస్తులకు లాభదాయకం. స్త్రీలకు వస్త్రములు, అలంకరణలు, విలాస వస్తువుల పట్ల ఆకర్షణ పెరుగుతుంది. వాణిజ్య ఒప్పందాలు, స్థిరచరాస్తుల లావాదేవీల్లో ఏకాగ్రత వహించండి. గత కొంతకాలంగా మీరు అనుభవిస్తున్న ఒత్తిళ్లు, చికాకులు క్రమంగా తొలగిపోతాయి. **మిథునం** : ఉద్యోగస్తుల సమర్థతకు మంచి గుర్తింపు లభిస్తుంది. రుణం ఏ కొంతైనా తీర్చాలన్న మీ సంకల్పం నెరవేరగలదు. స్త్రీలు భేషజాలకు, మొహమాటాలకు పోవటం మంచిది కాదు. బంధువుల రాకతో గృహంలో సందడి కానవస్తుంది. విద్యార్థులకు ధ్యేయంపట్ల ఏకాగ్రత చాలా అవసరం. **కర్కాటకం:** అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. లీజు, ఏజెన్సీ, స్థిరాస్తుల కొనుగోళ్ల విషయంలో తొందరపాటుతనం కూడదు. దంపతుల మధ్య కలహాలు తలెత్తే ఆస్కారం ఉంది. ఏజెంట్లు, మార్కెటింగ్ రంగాల వారి టార్గెట్లు పూర్తి కాగలవు. సేవ, సాంఘిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. దేవాల యాలను దర్శిస్తారు. **సింహం:** కుటుంబ సమస్యలు తీరి, ఆర్థిక పరిస్థితిలో ఆశాజనకమైన మార్పులు సంభవిస్తాయి. పాత మిత్రుల కలయికతో మీలో మార్పు వస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. మీ యత్నాలకు సన్నిహితులు అన్నివిధాలా సహకరిస్తారు. తలపెట్టిన పనులు కొంత ఆలస్యంగా నైనా పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యే సూచన లున్నాయి. **కన్య:** ఆస్తి వ్యవ హారాల్లో ముఖ్యుల ప్రతిపాదనల్ని వ్యతిరేకిస్తారు. గృహ నిర్మాణాలు, మరమ్మత్తులు చేపడతారు. ఉద్యోగస్తులకు తోటివారితో సమస్యలు తలెత్తుతాయి. నిరుద్యోగ యత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. ప్రైవేటు సంస్థలలోని వారికి నిరుత్సాహం కలిగి స్తుంది. **తుల:** ఆర్థిక లావాదేవీలు, కీలకమైన వ్యవహారాలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. స్త్రీలకు చుట్టుప్రక్కల వారి నుంచి ఆహ్వానాలు అందుతాయి. నిత్యా వసర వస్తు వ్యాపారులకు, స్టాకిస్టులకు కలసిరాగలదు. కుటుంబ సౌఖ్యం, ఆత్మీయులతో వినోదాలు వంటి శుభ పరిణామాలుంటాయి. **వృశ్చికం:** స్త్రీల మాటకు వ్యతిరేకత ఎదురవుతుంది. విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనలకు గురవుతారు. ఉద్యోగయత్నాలు ఆశాజనకంగా సాగుతాయి. ప్రయాణాల్లో తగు జాగ్రత్తలు తీసు కోవలసి ఉంటుంది. దూరపు బంధువుల నుంచి బహుమతులను అందుకుంటారు. చేతి వృత్తి వ్యాపారులకు అన్నివిధాలా అనుకూలం. **ధనుస్సు:** స్త్రీల ఆలోచనలు పాదుపు దిశగా కొన సాగు తాయి. దైవదీక్షలు, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగు తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల తీరును గమనించి మెలగాల్సి ఉంటుంది. నూతన పెట్టుబడులు, టెండర్లు అనుకూలిస్తాయి. **మకరం:** విద్యార్థులు నిరంతర కృషివల్ల అభివృద్ధి పొందుతారు. భాగస్వామిక చర్చల్లో మీ ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తుంది. ఆస్తి వ్యవహారాలకు సంబంధించి సోదరులతో ఒక అవ గాహనకు వస్తారు. వృత్తుల వారికి, ఏజెంట్లు, బ్రోకర్ల శ్రమకు తగిన ఆదాయం లభిస్తుంది. గృహ నిర్మాణాలు, మరమ్మత్తులు అనుకూలిస్తాయి. **కుంభం:** రాబడికి మించిన ఖర్చులు, చెల్లింపులవల్ల స్వల్ప ఆటుపోట్లు తప్పవు. ప్రింటింగ్, బైండింగ్ పనివారలకు మందకొడిగా ఉంటుంది. ఇచ్చిపుచ్చుకునే వ్యవ హారాలలో ఏకాగ్రత అవసరం. ఉద్యోగస్తుల కార్యదీక్ష, **మీనం:** దైవదీక్షలు, సామాజిక సేవలపట్ల ఆసక్తి పెరుగుతుంది. వృత్తుల వారికి అన్ని విధాలా కలసి రాగలదు.



## 48వ వార్డులో సోలార్ ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటుకు కృషి చేసిన కార్పొరేటర్ అభ్యర్థి గుత్తుల (నీలి) తిరుమలదేవి

కంచరపాలెం : విశాఖ ఉత్తర నియోజకవర్గం లోని 48 వార్డులో వైస్సార్ కార్పొరేటర్ అభ్యర్థి గుత్తుల (నీలి) తిరుమలదేవి వార్డ్ పర్యటన లో పలు మార్లు కొలనీ వాసులు కొండ మీద ప్రాంతంలో చాలా చీకటి గా వున్న ప్రదేశాలలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయమని కోరడమైనది. ఆ సమస్య ను వార్డు అధ్యక్షుడు నీలి రవి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన వెంటనే స్పందించి పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ తో మాట్లాడి ఆయన ఎంపీ నిధులతో అటల్ జ్యోతి యోజన ద్వారా ఉత్తర నియోజకవర్గ పరిధిలోని మొత్తం 100 సోలార్ పోల్స్ మంజూరు చేశారు.

వీటిలో గురువారం సోలార్ పోల్స్ వార్డు వైకాపా అభ్యర్థి గుత్తుల (నీలి) తిరుమలదేవి, వార్డు అధ్యక్షుడు నీలి రవి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇందుకు సహకరించిన కె కెరాజు కి మరియు పార్లమెంట్ సభ్యులు ఎం వి వి సత్యనారాయణ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డొప్ప శ్రీను, నాయుడు, తమ్మినాయుడు, సచివాలయం అడ్మిన్ సుధీర్, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అపోలో హాస్పిటల్స్ విశాఖపట్నం తొమ్మిది కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు సాధించింది



విశాఖపట్నం : అపోలో హాస్పిటల్స్, హెల్త్ సిటీ, విశాఖపట్నం వరుసగా తొమ్మిది కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేయడం ద్వారా మరో మైలురాయిని సాధించింది (23 & 24 డిసెంబర్ 2020). ఈ రోజు వరకు మేము 70 కోక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలను అద్భుతమైన ఫలితాలతో మరియు అద్భుతమైన ట్రాక్ రికార్డ్‌తో నిర్వహించాము.

కోక్లియర్ ఇంప్లాంట్ అనేది ఒక చిన్న, సంక్లిష్టమైన ఎలక్ట్రానిక్ పరికరం, ఇది చాలా చెవిటి లేదా తీవ్రంగా వినికిడి లేని వ్యక్తికి ధ్వని భావాన్ని అందించడంలో సహాయపడుతుంది. వినికిడి చికిత్స వలె కాకుండా, కోక్లియర్ ఇంప్లాంట్ చెవి యొక్క దెబ్బతిన్న భాగాలను దాటవేస్తుంది మరియు శ్రవణ నాడిని నేరుగా ప్రేరేపిస్తుంది. డా. సమీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అపోలో హాస్పిటల్స్ విశాఖపట్నం మాట్లాడుతూ, "మా కోక్లియర్ ఇంప్లాంట్ ప్రోగ్రాం ఈ పిల్లల కుటుంబాలలో చిరునవ్వులను తెస్తున్న తీరు పట్ల మేము సంతోషంగా ఉన్నాము. అపోలో హాస్పిటల్స్ విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ లోని ఉత్తమ కోక్లియర్ ఇంప్లాంట్ సెంటర్ మరియు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం మరియు సేవలతో ప్రజలకు మద్దతు ఇవ్వడానికి అవగాహన కల్పించడంలో మేము ఎల్లప్పుడూ ముందంజలో ఉన్నాము. ప్రస్తుతానికి ఇంప్లాంట్ ఖర్చులు ఖరీదైనవి అయినప్పటికీ, మేము ఈ పిల్లలకు ఏడీప్ పథకం కింద డా.ఈ సి వినయ కుమార్, ఇఎన్టీ చీఫ్ మెంటార్ ఫర్ కోక్లియర్ ఇంప్లాంట్ ప్రోగ్రామ్ మార్గదర్శకత్వంతో సహాయం చేయగలుగుతున్నాము.. ఏడీప్ మార్గదర్శకాల ప్రకారం రోగులకు ఉచితంగా చేసే ఈ శస్త్రచికిత్సలు డైరెక్టర్ డా. సుని మరియ మాథ్యూ , డైరెక్టర్ మరియు డా. ఎస్పి రత్న కుమార్, నోడల్ ఆఫీసర్, సోథెర్న్ జోన్, ఏడీప్ -ముంబై."

డా. కోకా రాంబాబు సీనియర్ ఇఎన్టి & మెంటర్ కోక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ మాట్లాడుతూ, ఇది ఖరీదైన చికిత్స అయినప్పటికీ, పిల్లలకి సాధారణ జీవితం గడపడానికి అవకాశం కల్పిస్తుందని, ఎవరికైనా సాధారణ ప్రసంగం మరియు భాషా నైపుణ్యాలను సాధించడానికి మరియు ప్రధాన ప్రవాహంలో చేరడానికి కోక్లియర్ ఇంప్లాంటేషన్ ను దోహద పడుతుంది . సాధారణ పిల్లలగా విద్య మరియు అన్ని అవకాశాలను సాధించవచ్చు. ప్రారంభ దశలో పిల్లలలో చెవుడును గుర్తించడం గురించి అవగాహన కల్పించడం చాలా అవసరం. చెవిటితనాన్ని గుర్తించడానికి తాజా సాంకేతికత అందుబాటులో ఉంది మరియు పిల్లలందరికీ వినికిడి కోసం పరీక్షించాల్సిన అవసరం ఉంది.

కోక్లియర్ ఇంప్లాంట్ ఉన్న పిల్లవాడు సాధారణ జీవితాన్ని గడపగలడు మరియు వారి పనితీరు భిన్నంగా లేదు, వాస్తవానికి వారిలో కొందరు అధ్యయనాలలో రాణిస్తారు.

చాలా చిన్న వయస్సులోనే పిల్లలలో ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సలను నిర్వహించడానికి మాకు అనస్థీషియాలజిస్టుల సమర్థవంతమైన బృందం ఉంది. డా.టి. కృష్ణ కిషోర్, సీనియర్ ఇఎన్టి కోక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ మాట్లాడుతూ, అపోలో హాస్పిటల్స్ విశాఖపట్నం వద్ద మేము వినికిడి వైకల్యం ఉన్న రోగులను గుర్తించడానికి మరియు వ్రాతపని కోసం ఏడీప్ సమన్వయం చేసుకోవడానికి ఉచిత స్క్రీనింగ్ క్యాంలు

మరియు క్లినిక్ లను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాము. పిల్లలలో చెవిటితనం యొక్క ముందస్తు గుర్తింపు చాలా ముఖ్యమైనది, ఎందుకంటే పిల్లవాడు ఐదేళ్ల లోపు ఆపరేషన్ చేయబడితే మేము ఉత్తమ ఫలితాలను సాధించగలము.

డాక్టర్ డి. నవీన్ కుమార్, ఇఎన్టి సర్జన్, ఎం ఎ శ్రీకాంత్ (చీఫ్ ఆడియాలజిస్ట్) మరియు సంపత్ (ఆడియాలజిస్ట్) ఈ మైలురాయి శస్త్రచికిత్సలలో భాగమైన ఇతర బృంధ సభ్యులు ఈ పిల్లలకు చెవుడును అధిగమించడంలో సహాయపడుతున్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## - ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బెందాళం పద్మావతి



మద్దిలపాలెం: స్థానిక ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్లో జరుగుతున్న డ్వాక్రా బజార్ ను గురువారం 24వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సాడి పద్మారెడ్డి, వైసీపీ నాయకులు అప్పల రాజు, కనకమాలక్ష్మి లతో కలిసి ఆంధ్రప్రదేశ్ కాలింగ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొ రేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెందాళం పద్మావతి సందర్శించారు. అభ్యుదయ గ్రామీణ స్టేట్ కమిటీ ప్రెసిడెంట్ దేవకీదేవి సాదర స్వాగతం పలికి శాలువాతో సత్కరించడం జరిగినది .పలు రాష్ట్రాల నుంచి 300కు పైగా ఉన్న స్టాళ్ళను పరిశీలించి వారికి తన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి రంగంలోనూ మహిళలు రాణించాలని వారికి అత్యంత ప్రాధాన్యం అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి, రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి కి తన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో ఇటువంటి డ్వాక్రా బజార్ మరిన్ని చేపట్టాలని ఈ సందర్భంగా పద్మావతి కోరారు. ఈ కార్యక్రమంలో స్టాళ్ల నిర్వహ కులతో పాటు బండారు లోకేష్ పాల్గొన్నారు.



# ఏయూ ఎన్ఎస్ఎస్కు రాష్ట్రస్థాయి అవార్డులు

## ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ప్రసంగిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకంకు రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. రాష్ట్ర స్థాయిలో అందించే అవార్డులలో మూడు విభాగాలో నాలుగు అవార్డులు లభించాయి.ఈ సందర్భంగా అవార్డులు సాధించిన వారికి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. గురువారం ఏయూ సెనేట్ మందిరంలో అవార్డులు సాధించిన వారిని అభినందించారు.

**అవార్డు గ్రహీతలు వీరే... :** ఉత్తమ ప్రోగ్రాం కోఆర్డినేటర్గా డాక్టర్ ఎస్.హరనాథ్, ఉత్తమ ప్రోగ్రాం అధికారుల విభాగంలో డాక్టర్ కె.మానిక్య కుమారి, వలంటీర్ల విభాగంలో సి.హెచ్ శివ శంకర్, కె.నిర్మల హైమలకు అవార్డులు లభించాయి. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ల విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం ఒక్కరినే ఎంపిక చేయగా ఈ అవార్డును ఏయూ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్కు లభించింది.

ఈ కార్యక్రమంలో....

రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ రాష్ట్ర ఇటిఐ కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# బాల, బాలికలకు క్రిస్మస్ గొప్పతనం తెలియజేసిన సంకు వెంకటేశ్వరరావు



విశాఖపట్నం : నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సంకు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. వందలాది మంది బాల బాలికలు రాగా నగర అధ్యక్షులు వెంకటేశ్వరరావు మరియు రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జి ఏ నారాయణ రావు క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ ప్రాధాన్యతను, ఏసు క్రీస్తు గొప్ప దనాన్ని తెలియ జేయడం జరిగింది. తర్వాత సంకు వెంకటే శ్వరరావు, జి ఎ నారాయణ రావు లు బాల బాలికలకు కేకు మరియు బహుమానాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు పెద్ద ఎత్తున బాలబాలికలు పాల్గొన్నారు

# శ్మశానవాటిక ప్రహరీ గోడకు శంకుస్థాపన



మాకవరపాలెం : మాకవరపాలెం మడలం బూరుగుపాలెం గ్రామంలో శ్మశానవాటిక ప్రహరీ గోడకు మాకవరపాలెం మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుత్తల సత్యనారాయణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు భీమిరెడ్డి గోవిందరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ సన్యాసినాయుడు, పోతల త్రినాధరావు పాల్గొన్నారు.

# బ్లాక్ చేసిన పోస్టులను విడుదల చేయాలి



మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలో స్థానిక మండల విద్యాశాఖ భవనం వద్ద గురువారం ఏపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ చేసిన పోస్టులపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిటిఎఫ్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాలో బ్లాక్ చేసిన పోస్టులను విడుదల చేయాలని ఆయన కోరారు. అనంతరం సాయి శైలజకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శేషగిరిరావు, చక్రవర్తి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# నడింపాలెంలో సహచట్టం ప్రచార ఐక్యవేదిక అవగాహన కార్యక్రమం

కొయ్యూరు : కొయ్యూరు మండలం నడింపాలెం గ్రామంలో సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.మాకి రెడ్డి, జిల్లా అధ్యక్షులు జక్కు నరసింహ మూర్తి, జిల్లా కార్యదర్శి పి.గురుస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి కె.త్రినాధరావు హాజరై ముందుగా నడింపాలెం కూడలిలో గల అల్లూరి, గాం గంటన్న దొర, మల్లు దొర విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భ:గా మాకిరెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ చట్టం అని, దీనిని అందరూ ఉపయోగించుకుని లబ్ది పొందాలనే తెలియజేశారు. నడింపాలెంలో మచ్చల అచి అమ్మ ఇంట్లో సమాచార హక్కు చట్టం కార్యాలయం ప్రారంభించారు. ఇకనుండి ఇ ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా ఇక్కడ తెలియ పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వి.రమణ, కొయ్యూరు మండల కన్వీనర్ మాస లోవారాజు, గొలుగొండ మండల కార్యదర్శి వంకదార శ్రీనివాసరావు, నాతవరం కార్యదర్శులు పాల్గొన్నారు.




గాం గంటన్నదొర, మల్లు దొర విగ్రహాలకు నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

## రోడ్లను బాగు చేయండి

కొయ్యూరు : కొయ్యూరు. మండలంలో బాలారం నుండి కిష్టారం వరకు రోడ్డు పూర్తిగా గుంతులమయమైందని, దీంతో రాకపోకలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు అప్పలరాజు తెలిపారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు మండల కేంద్రానికి రావాలన్నా, ఆసుపత్రికి పోవాలన్న, చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు అనేక సందర్భాల్లో ఆడాకుల గ్రామానికి జోగుంపేట మీదుగా వస్తున్నారని, వీరు బలరాం మీదుగా కిష్టారం వస్తే రోడ్డు పరిస్థితి చూసేవారన్నారు.

# జల జీవన్ మిషన్ ప్రతిష్టాత్మకముగా చేపట్టిన కార్యక్రమం నిర్వహించాలి

## ప్రాజెక్టు అధికారి సలిజాముల వెంకటేశ్వర్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశం



పాడేరు : గురువారం ఐటిడిఎ కార్యాలయములో ఈ విషయంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 50శాతం రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. మొదటి విడత గా 1,565 గిరిజన గ్రామాలకు ఇంటింటికి త్రాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని వీటికోసం 46.02 కోట్లు మంజూరు చేసినట్లు పి.ఒ.తెలిపారు. ఈ కుళాయిల ఏర్పాటుచేసిన తరువాత గ్రామాలలో నీరు మరియు పారిశుధ్య కమిటీలను ఏర్పాటుచేసి వారి పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపట్టాలని పి.ఒ. ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ లో గల 11మండలాలో పనులు సకాలములో పూర్తి చేయాలని ఈ నెల 28 తేది నాటికి సగం పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం పై (ఆర్డబ్ల్యుఎస్) (డి.ఇ.లు) (ఎ.ఇలు) ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశించిన సమయములో పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో (ఆర్డబ్ల్యుఎస్) ఇ.ఇ కె.రామస్వామి, డివిజనల్ పంచాయతీ అధికారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నియాదవ్ ను సత్కరించిన పరవాడ మండల యాదవ సంఘం



పరవాడ : పరవాడ మండలం, వెన్నెల పాలెం పంచాయితీ, గొల్లపాలెం గ్రామంలో, పరవాడ మండల యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు బంధం వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి యలమంచిలి భాస్కర్ ల సారధ్యంలో, మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత, రాష్ట్ర యాదవ సంక్షేమ సంఘం కార్యదర్శి, బొట్టా చిన్ని యాదవ్ కి ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమమునకు జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు భొరా సోమినాయుడు, జిల్లా కార్యదర్శి కర్రి అప్పలరాజు, జిల్లా యువత వర్కింగ్ ప్రెసిడెంట్ వియ్యపు చిన్న, మండల సంఘం గౌరవ అధ్యక్షులు సారిపల్లి జోగి నాయుడు, పెందుర్తి మార్కెట్ కమాటి వైస్ చైర్మన్ పైల జూనియర్ అప్పలనాయుడు, మాజీ మండల అధ్యక్షులు వీయ్యపు సూర్య చంద్ర, మండల ఉపాధ్యక్షులు సారిపల్లి ఆనంద్, మండల యువత అధ్యక్షులు పల్లా గోవింద్, గ్రామ పెద్దలు సర్వసిద్ధి పైడి రాజు, యలమంచిలి తాతబాబు, నమ్మి ప్రసాద్, సిరా శ్రీనివాస్, తదితర మండల యాదవ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొని చిన్ని యాదవ్ ను అభినందించారు.

# ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సలింగ్ వద్దు

## మాన్యువల్ కౌన్సలింగ్ నిర్వహించాలి




అచ్యుతాపురం : ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సలింగ్ కాకుండ మాన్యువల్ కౌన్సలింగ్ నిర్వహించాలని ఫ్యాప్టో రాష్ట్ర ప్రతినిధి జి మధు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీల్లో అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయులు గురువారం మండల విద్యాశాఖాధికారి కార్యలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు.

# సెల్టవర్ నిర్మించవద్దు



గొలుగొండ : గొలుగొండ మండలం ఏటిగైరంపేట గ్రామంలో సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకి అనుకోని సెల్ టవర్ నిర్మాణ పనులు జరగడంతో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జనావాసాల మధ్య నిర్మాణ పనులు ఆపివేయాలని వ్యతిరేకించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వాలంటీర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతుగా

# చిన్నారుల క్యాండిల్ ర్యాలీ




పెద్దాపురం : డిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా అన్నం పెట్టే రైతును కాపాడండి - భవిష్యత్ తరాలను కాపాడండి అంటూ వరహాలయ్యపేట సీతారామరాజు విగ్రహం నుండి శోభాదియేటర్ మీదుగా నువ్వులగుంట వీధిలోని భగత్ సింగ్ విగ్రహం వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి రైతులను కాపాడండి - దేశాన్ని కాపాడండి, అన్నం పెట్టే రైతులను రోడ్డున పడేయకండి అంటూ నినాదాలు చేశారు.

అనంతరం భగత్ సింగ్ విగ్రహం వద్ద డిల్లీలో అమరులైన 33 మంది రైతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి బాల కళాకారులు పాల్గొన్నారు.

# పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల పరిశీలన



అచ్యుతాపురం : నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టనున్న పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల పంపిణి కార్యక్రమంలో బాగంగా మండలంలో చోడపల్లి, ఖాజీపాలెం గ్రామాలలో ఇళ్ల స్థలాల లే అవుట్లును గురువారం స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ రవి జోసఫ్, తహాశీల్దార్ రాంబాయి పరిశీలించారు. మండలంలో సుమారు 1867 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోనా బుజ్జి, గండిబోయిన వెంకట్, కొమ్మోజు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

# సీఎం కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేత భీమిలి టైగర్స్




భీమునిపట్నం : భీమిలి మినీ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ క్రికెట్ టోర్నమెంట్లో శుక్రవారం 2వార్డు చిల్లపేట మరియు 3వార్డు భీమిలి టైగర్స్ మధ్య జరిగిన పోటీలో భీమిలి టైగర్స్ విజేతగా నిలిచింది ఈ మ్యాచ్ లో మాన్ ఆఫ్ ది మ్యాచ్ మద్దిి.హేమంత్ కు వచ్చింది. ఈ సందర్భంగా మైలపల్లి భారతి షణ్ముఖరావు మాట్లాడుతూ భీమిలి టైగర్స్ టీం మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటు న్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో అక్కరమాని రామా నాయుడు, కరుణాకర్ రెడ్డి, బాస్కర్ రెడ్డి,మధు నాయుడు మొకర నర్సింగరావు, డి.దుర్గా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైరస్‌లను నిలువరించే

# ఉపకరణాలు బహూకరణ



వీసీ ప్రసాద రెడ్డికి షైకోకాన్‌లను అందిస్తున్న రమేష్ రెడ్డి

ఏయూ : ఆంధ్ర విశ్వవిద్యాలలయానికి స్వాతి ప్రమోటర్స్ సంస్థ ఎండి మేడపాటి రమేష్ రెడ్డి వైరస్‌లను వినోధించే సాంకేతిక ఉపకరణాలు షైకోకాన్‌లను బహూకరించారు. గురువారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని కార్యాలయంలో కలసి రెండు షైకోకాన్‌లను అందజేశారు. వీటి వలన ఉపరితలంపై ఉండే వైరస్‌లను నాశనం చేయడం సాధ్యపడుతుందన్నారు. కార్యా లయాలలో ఉపయక్తంగా ఇవి నిలుస్తాయని వివరించారు. వర్సిటీకి ఉపయుక్తంగా ఉపకరణాలు అందించిన రమేష్ రెడ్డిని ఏయూ వీసీ అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ వారియర్స్ హక్కుల సమితి ఆధ్వర్యంలో 4వరోజు రిలే నిరాహార దీక్షలు




పాడేరు : కోవిడ్ వారియర్స్ హక్కుల సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరింది. దీక్షకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్ శంకర్ రావు, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ అధ్యక్షులు చెట్టి నాగరాజు, ఉపాధ్యక్షులు కే లక్ష్మణ్ రావు నాలుగో రోజు దీక్షకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: గతంలో ఇదే ఐటీడీఏ ప్రాంగణంలో మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు చేసిన ఫలితంగా వారి యొక్క సమస్యలు పరిష్క రించుకో గలిగాం కావున మీరు పోరాటంలో నిరుత్సాహం చెందకుండా మరింత ఉత్సాహంతో సమస్యల పరిష్కారానికై ఉద్యమించాలని చెప్పారు. అలానే అధికారులు స్పందించి కోవిడ్ వారియర్స్ పెండింగ్ జీతాలు సర్వీస్ సర్టిఫికెట్ కూడా వీరికి అందజేయాలని , వారన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలు అరచేతిలో గుప్పెట్లో పెట్టుకొని,కోవిడ్ మరణాలు సంభవిస్తున్నాప్పటికీ, కనీసం పేషెంట్ దగ్గర వెళ్లలేని పరిస్థితుల్లో కూడా తమతో సేవలు చేయించుకొని, ఇప్పుడు రోడ్డుమీద వదిలేయటం చాలా దుర్మార్గమని, తక్షణమే కోవిడ్ వారియర్స్ ను విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు నెలల బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని,డిమాండ్ చేశారు. మీరు చేస్తున్న ఈ పోరాటానికి సీఐటీయూగా సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోవిడ్ వారియర్స్ గౌరవాధ్యక్షులు అమర్, అధ్యక్షులు పి.దుర్గ, కార్యదర్శి ఎల్ రోజా, గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఏ ఐ వై ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు, జీవన్ ,మున్నా, సహాయ కార్యదర్శులు శ్రీదేవి, గిరిజ, నాగమల్లేశ్వరి, ఉపాధ్యక్షులు రూప వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతు చట్టం పై అవగాహన కరపత్రం విడుదల

- సుపరిపాలన బీజేపితోనే సాధ్యం    - గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



గాజువాక : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు చట్టం పై అవగాహన కరపత్రాలను బీజేపీ గాజువాక కన్వీనర్ డాక్టర్ కర్ణంరెడ్డి నర్సింగరావు విడుదల చేశారు. గాజువాక పాత కర్ణవానిపాలెంలో బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో కెఎన్ఆర్ మాట్లాడుతూ సుపరిపాలన బీజేపీ తోనే సాధ్యం అని అన్నారు. భారతదేశ మాజీ ప్రదాని, భారత రత్న స్వర్గీయ అటల్ బీహారీ వాజ్ పాయి జయంతి ఉత్సవాల ను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నేడు శుక్రవారం గాజువాక నియోజకవర్గం లో గల అన్ని వార్డులలో వాజపేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి,ఆయన జీవిత చరిత్రను నేటి యువతకు తెలియ జేయాలని కోరారు. అనంతరం రైతు చట్టంపై ప్రజలకు అవగాహణ కల్పిస్తూ, పార్టీ పెద్దలు తయారుచేసి, ముద్రించి పంపించిన కరపత్రాలను అందరికీ అందజేయా లని తెలియ జేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి శుక్రవారం మధ్యా హ్నం 12 గం.ల నుండి 1 గం.వరకు ప్రసంగిస్తారని, ఆ వీడియోను ప్రజలు వీక్షించేలా టీవీ లను ప్రతి జంక్షన్ వద్ద ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం కరపత్రాలను వార్డుఅధ్యక్షులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోలి.శంకర రావు,కో-కన్వీనర్ గూటూరు శంకరరావు,72వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి సిరసపల్లి .నూకరాజు,మాజీ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబర్ గరికిన పైడిరాజు, 76 వ వార్డు అధ్యక్షుడు బొండా.అచ్చిబాబు,వార్డు ఇంచార్జి సియాద్రి.అప్పలరాజు,74వ వార్డు అధ్యక్షుడు పిట్టా.అప్పలరెడ్డి, 79వ వార్డు అధ్యక్షులు కోసూరు తాతారావు, 85వ వార్డు అధ్యక్షులు సత్తిబాబు, 86వ వార్డు అధ్యక్షులు అమరపిన్ని వెంకట రమణారావు, 66వ వార్డు ఉపాధ్యక్షులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సీఆర్పీఎఫ్ జవాన్ కంటి చూపును విజయవంతంగా పునరుద్ధరించిన మెడికోవర్ హాస్పిటల్స్




విశాఖపట్నం : జమ్మూ అండ్ కాశ్మీర్ వద్ద గాయపడిన సీఆర్పీఎఫ్ జవాన్ కంటి చూపును విజయ వంతంగా పునరుద్దరించిన మెడికవర్ హాస్పిటల్స్ ఏపీ/తెలంగాణాలో మొట్టమొదటిసారిగా అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స చేశారు వైజాగ్/ హైదరాబాద్, 24 డిసెంబర్ 2020 : ప్రపంచంలో అత్యంత గౌరవనీయమైన హెల్త్ కేర్ బ్రాండ్లలో ఒకటైన మెడికవర్ హాస్పిటల్స్ నేడు విజయవంతంగా డ్యూరల్ ఏవీ ఫిస్ట్యులా చికిత్సను చేసింది. వైజాగ్ కు చెందిన 48 సంవత్సరాల వయసు కలిగిన సీఆర్పీఎఫ్ జవాన్ జెలిపిగరి మల్లయ్య, జమ్మూ అండ్ కాశ్మీర్ లో విధులు నిర్వహిస్తోన్న ఆయన అకస్మాత్తుగా 08 మార్చి 2020వ తేదీన కంటి చూపును కోల్పోయారు. ఆయన మెదడులో డ్యూరల్ ఏవీ ఫిస్ట్యులా (డీఏవీఎఫ్) ఉన్నట్లుగా నిర్ధారించడం జరిగింది. హైదరాబాద్ లో అతనికి శస్త్రచికిత్స చేశారు కానీ అది అక్కడ విజయవంతం కాలేదు. కొన్ని డీఏవీఎస్లు ప్రాణాంతికమైనవి. వీటి కారణంగా తలనొప్పి, మూర్ఛ లేదా స్ట్రోక్ రావడం జరగవచ్చు. జమ్మూ అండ్ కాశ్మీర్ నుంచి నేరుగా వ్యాధి నిర్ధారణ, చికిత్స కోసం హైదరాబాదు శ్రీ మల్లయ్య వచ్చారు. అనంతరం ఆయనను వైజాగ్ లోని మెడికవర్ హాస్పిటల్ కు రిఫర్ చేశారు. అక్కడ న్యూరో వాస్క్యులర్ ఇంటర్వెన్షన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శివశంకర్ దలై ఈయనను పరీక్షించారు. డ్యూయల్ ఏవీ ఫిస్టులాకు రెండు దశలలో ఆయన చికిత్స అందించారు. తొలి దశలో 15 డిసెంబర్ 2020న రెండవ దశను 17 డిసెంబర్ 2020 వ తేదీ చేశారు. ఎంబోలైజేషన్ జరిగిన 24 గంటలలోనే అతని చూపు సాధారణంగా వచ్చింది మరియు తలనొప్పి సైతం తగ్గింది. పరిశీలనలో ఉంచిన తరువాత అతనిని ఇటీవలనే డిశ్చార్జ్ చేశారు. ఈ శస్త్రచికిత్స గురించి మెడికవర్ హాస్పిటల్స్ (న్యూరో వాస్క్యులర్ ఇంటర్వెన్షన్ సీనియర్ కన్సల్టెంట్) డాక్టర్ శివశంకర్ దలై మాట్లాడుతూ "అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన మొత్తం న్యూరోవాస్క్యులర్ టీమ్ ను అభినందిస్తున్నాను. డ్యూరల్ ఏవీ ఫిస్టులా అనేది అత్యంత క్లిష్టమైన న్యూరో వాస్క్యులర్ సమస్య. ఇది మెదడుకు సంబంధించి పలు సమస్యలను సైతం కలిగిస్తుంది. డ్యూరల్ ఆర్టెరియో వీనస్ ఫిస్టులా చికిత్స చేయడానికి ఒకే ఒక్క మార్గం ఎంబోలైజేషన్. మా బృందం పట్ల నమ్మకం ఉంచడంతో పాటుగా సహకరించిన మల్లయ్యను అభినందిస్తున్నాను' అని అన్నారు.

# క్రీడలతో నవసమాజం ఆరోగ్యం

- భారత్‌లో క్రికెట్‌కు తగ్గని ఆదరణ    - వీపీఎల్ టోర్నీలో ముఖ్య అతిథిగా జేడీ లక్ష్మీనారాయణ



విశాఖపట్నం : క్రీడలతోనే నవసమాజ ఆరోగ్యానికి సాధ్యపడుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ , జేడి పౌండేషన్ అధినేత వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. రైల్వే స్టేడియంలో నిర్వహిస్తున్న విశాఖ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం నాటి పోటీలకు ముఖ్యఅతిధిగా హాజరై జేడి ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుంచి జేడి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి జాతీయ గీతం ఆలపించి దేశ భక్తిని చాటిచెప్పారు. తరువాత క్రీడాకారులందరిని పరిచయం చేసుకున్నారు. అనంతరం కాసేపు బ్యాటింగ్ చేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారత్‌లో క్రికెట్‌కు ఆదరణ ఏ మాత్రం తగ్గలేదని, క్రమేపీ పెరుగుతూ వస్తుందన్నారు. క్రీడల వల్ల శారీరక దారుడ్యం మెరుగుపడటంతో పాటు, మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఇదే సమయంలో ప్రభుత్వ, ప్రయివేటుగా ఉపాది అవకావశాలు లభిస్తాయన్నారు. ఐపీఎల్ తరహాలో విశాఖలో వీపీఎల్ నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకుడు ఎమ్.రాజాను లక్ష్మీనారాయణ అభినందించారు. గౌరవ అతిధిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ 19 రోజుల పాటు జరిగే విశాఖ ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రతి రోజు ఉత్కంఠగా సాగుతున్నాయన్నారు. ఇందులో పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలు చాటుకుంటున్నారని ఈ టోర్నమెంట్ విశాఖ నగరానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. టోర్ని నిర్వాహకుడు కె.ఆర్.అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్.రాజా మాట్లాడుతూ అందరి సహకారంతోనే ఐపీఎల్ విజయవంతంగా నిర్వహిస్తున్నా మన్నారు. గాజువాకతో పాటు, రైల్వే స్టేడియంలలోనూ ఆయా మ్యాచ్‌లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మేడిది రాజశేఖర్, బాజినాయుడు, మౌళీ, శరత్ పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నిజం చేయనున్న సీఎం వైయస్ జగన్



విశాఖపట్నం : బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి, క్రిస్మస్ పండుగలు పురస్కరించుకొని రాష్ట్రంలో పేద ప్రజలందరికీ సొంతింటి కలను వైయస్ జగన్ నెరవేర్చబోతున్నారని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ, ఎక్కడా జరగని విధంగా 30.75 లక్షల మందికి ఇళ్ళ పట్టాలను ప్రభుత్వం ఒకేసారి ఇస్తోందని మంత్రి బొత్స తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో మహానేత వైయస్ఆర్ హయాంలో 27 లక్షల ఇళ్ల పట్టాలు అందజేయటం జరిగిందన్నారు. మళ్లీ ఆ తర్వాత జరుగుతున్న అతి పెద్ద కార్యక్రమం ఇదేనని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రేపు మధ్యాహ్నం మూడు గంటలకు తూర్పుగోదావరి జిల్లాలో కొమరిగిరి వద్దనున్న కె.కొత్తపల్లిలో సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారని బొత్స తెలిపారు. లబ్ధిదారులకు పట్టణాల్లో సెంటు స్థలం, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలం ఇస్తున్నామని బొత్స తెలిపారు. అంతేకాకుండా 2.62 లక్షల టిడ్కో ఇళ్ళకు సేల్ అగ్రిమెంట్లు పంపిణీ చేస్తున్నామని అన్నారు. గతంలో 300 చ.అ. ఇళ్లకు సంబంధించి బ్యాంకు రుణాల ద్వారా నెలకు రూ.2,800లు చెల్లించాలి. అయితే అవేమీ లేకుండా వైయస్ జగన్ ప్రభుత్వం 300 చ.అ. ఇంటిని లబ్ధిదారులకు కేవలం ఒక్క రూపాయికే అందజేస్తోందని బొత్స తెలిపారు. డిసెంబర్ 27 నుంచి జనవరి 7లోపు సేల్ అగ్రిమెంట్స్ ను ఇవ్వబోతున్నామని బొత్స తెలిపారు. ఇవి కాకుండా సొంత స్థలం ఉన్న 4 లక్షల మంది పేదలకి రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చబోతోందని బొత్స అన్నారు. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న ప్రతి ఒక్కరికీ తమతర, పార్టీ బేధం లేకుండా పేదరికమే ప్రాతిపదికగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేస్తోందని బొత్స సత్యనారాయణ తెలిపారు.

ఈ కార్యక్రమం ఎప్పుడో జరగాల్సింది అని బొత్స అన్నారు. గత జులైలోనే మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజునే నిర్వహించాలని అనుకున్నామని బొత్స తెలిపారు. కోర్టుల్లో టీడీపీ కేసులు వేసి స్టేలు తీసుకురావటం జరగటం వల్ల ఈ కార్యక్రమం ఆలస్యమైందని బొత్స తెలిపారు. స్థలాలు ఇచ్చినప్పుడే సేల్ డీడ్ ఇవ్వాలని సీఎం గారు చెప్పారు. అయితే కొన్ని దుష్టశక్తులు అడ్డుకోవటం వల్ల ప్రస్తుతం డీఫాం పట్టాలు ఇస్తున్నామని ... న్యాయస్థానాల్లో చిక్కులు విడిపోయిన తర్వాత వారికి సేల్ డీడ్ పట్టాలను ప్రభుత్వం అందిస్తుందని బొత్స స్పష్టం చేశారు. ఈ లేఅవుట్ల వల్ల రాష్ట్రంలో కొత్తగా 17,000 గ్రామాలు, టౌన్‌షిప్పులు తయారు అవుతున్నాయని బొత్స సత్యనారాయణ తెలిపారు. దివంగత వైయస్ఆర్ హయాంలో గ్రామాల్లో పూరిపాకలు లేని రాష్ట్రంగా తయారు చేయాలని ముందుకు వెళ్లాం. పూరిపాకలు ఉన్నచోట్ల ఇళ్లను నిర్మించటం జరిగింది. రేపు సుమారు 15.60 లక్షల ఇళ్లకు పనులు ప్రారంభించబోతున్నామని బొత్స తెలిపారు. ఒక్కో ఇంటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.80 లక్షలు ఇస్తున్నాయని బొత్స అన్నారు. భూమి అంతా రాష్ట్ర ప్రభుత్వానిదే అని బొత్స పేర్కొన్నారు. ఇంటికి ఇస్తున్న డబ్బు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇస్తున్నామని బొత్స తెలిపారు. వచ్చే సంవత్సరం నుంచి మిగతా 12.70 లక్షల ఇళ్లను ప్రారంభిస్తామని బొత్స తెలిపారు. 30 లక్షల ఇళ్ల విలువ చూసుకుంటే.. రూ.85వేల కోట్ల విలువైన ఆస్తుల్ని 30 లక్షల మంది పేదలకు ప్రభుత్వం దఖలు చేయబోతోందన్నారు. ఎన్నికల ముందు శ్రీ వైయస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్లు ఇవ్వటం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని బొత్స సత్యనారాయణ తెలిపారు. 365 చ.అ. ఇల్లు ఏవైతే ఉన్నాయో వాటికి రూ.50 వేలు ముందు కట్టి తర్వాత బ్యాంకు నుంచి రుణం ద్వారా వాయిదాలు కట్టాలని, 430 చ.అ. ఇళ్లకు ముందుగా రూ.లక్ష కట్టి తర్వాత మిగతాది బ్యాంకు నుంచి అప్పుగా తీసుకోవాలి. అయితే, 365 చ.అ, 430 చ.అ. ఇళ్లలో అడ్వాన్స్‌లలో సగభాగం ప్రభుత్వమే లబ్ధిదారుల తరుపున భరిస్తుందని బొత్స తెలిపారు. అంటే.. రూ.50 వేలు కట్టాల్సిన వారు రూ.25వేలు, రూ.లక్ష కట్టాల్సిన వారు రూ.50వేలు మాత్రమే కడితే చాలన్నారు. ఇంతకుముందు డబ్బులు కట్టిన అర్హులైన లబ్ధిదారులకు కూడా తిరిగి డబ్బులు చెల్లించమని సీఎం శ్రీ వైయస్ జగన్ ఆదేశించారని బొత్స తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై రూ.438 కోట్లు అదనంగా భారం పడుతుందన్నారు. ఇదేమీ భారం కాదని పేదవారికి ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 430 చ.అ. టిడ్కో ఇళ్లను పొందిన వారు 74,310 మంది ఉన్నారు. ఆ లబ్ధిదారులకు రూ.50వేలు రాయితీ వస్తుందని బొత్స తెలిపారు. అదే విధంగా 365 చ.అ. టిడ్కో ఇళ్లను 44,304 మంది పొందారని వీరికి రూ.25వేలు రాయితీ వస్తుందన్నారు. 300 చ.అ. టిడ్కో ఇళ్లను 1,43,600 మందికి ఒక్క రూపాయికే ఇస్తున్నామని బొత్స స్పష్టం చేశారు. డిసెంబర్ 25 నుంచి సేల్ అగ్రిమెంట్ ఇవ్వటం జరుగుతుందని బొత్స సత్యనారాయణ తెలిపారు. గత ప్రభుత్వంలో ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ జరగలేదని బొత్స అన్నారు.

ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ గారు తూర్పు గోదావరి జిల్లాలో ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆతర్వాత డిసెంబర్ 28న చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలోనూ, ఆపైన ఉత్తరాంధ్రలోని విజయనగరంలోనూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని బొత్స తెలిపారు. రాష్ట్రంలోని నలుమూలలా సీఎం శ్రీ వైయస్ జగన్ పర్యటించి పేద అక్కచెల్లెమ్మలను కలుస్తారని బొత్స చెప్పారు. డిసెంబర్ 25 నుంచి జనవరి 7వరకు రాష్ట్రవ్యాప్తంగా పది రోజులు పాటు ఒక పండుగలా ఈ కార్యక్రమం జరుగుతుందని బొత్స వివరించారు. విజయనగరంలో ఇస్తున్న లేఅవుట్‌లో 12వేల పట్టాలు ఇస్తున్నామని బొత్స తెలిపారు. లబ్ధిదారుడిని స్థలం వద్ద పెట్టి ఫొటో తీసి హద్దులతో సహా డాక్యుమెంట్ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇన్ని కార్యక్రమాలు జరుగుతుంటే.. అధికారం కోల్పోయిన ప్రతిపక్ష నాయకుడికి నిద్రపట్టడం లేదు. చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు. ఇందులో అవినీతి జరిగిందని అంటున్నారు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పండని బొత్స ప్రశ్నించారు.

పేదవాడు పేదవాడిగానే ఉండాలనేది టీడీపీ విధానమని బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. పేదవాడు కూడా తలెత్తుకు తిరగాలని వారి మనస్సులోని కోరిక నెరవేరాలని సీఎం శ్రీ జగన్ గారి అభిమతమని బొత్స అన్నారు. దీనిబట్టే ప్రతిపక్ష నాయకుడుకి, మా నాయకుడికి మధ్య వ్యత్యాసం ఎంత ఉందో అర్థమౌతుందన్నారు. ప్రతిదీ రాజకీయ కోణంలో లబ్ది కోసం ఎదుటి పార్టీపై బురద చల్లాలని ఇష్టారాజ్యంగా చంద్రబాబు మాట్లాడుతున్నారు. ఇది చాలా శోచనీయం. ఇప్పటికే టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజలు ఏమీ అమాయకులు కాదు. వాస్తవాలు ఏంటో ఆలోచిస్తున్నారు.

# దివీస్ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు, మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుంది: నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం : దివీస్ పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు, మత్స్యకారులు చేస్తున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు దివీస్ ఘటనపై టీడీపీ నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ సభ్యులుగా బండారు సత్యనారాయణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, వర్మ, పిల్లి సత్యనారాయణ మూర్తి, వనమూడి కొండబాబు, యనమల కృష్ణుడు, వరపుల రాజా నియమించబడ్డారు. ఈ పర్యటనలో భాగంగా నిజనిర్ధారణ కమిటీతో పాటు పెద్దాపురం మాజీ మున్సిపల్ ఛైర్మన్ మరియు రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, తాండవ షుగర్స్ మాజీ ఛైర్మన్ సుర్ల లోవరాజు, సామర్లకోట తెదేపా సీనియర్ నాయకులు గొరకపూడి చిన్నయ్య దొర, ప్రత్తిపాడు తెదేపా సీనియర్ నాయకులు కొమ్ముల కన్నబాబు పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం గురువారం తెదేపా నిజనిర్ధారణ కమీటీ తొండంగి మండలంలో దివీస్ ఏర్పాటు ప్రాంతంలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానికులు, పోరాటకమిటీ సభ్యులు అన్యాయంగా మాపై కేసులు బనాయించడంతో పాటు పోలీసు బందోబస్తుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. మేము ఓట్లేసి గెలిపించిన నాయకులే మాకు భరోసా ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతంలో పరిశ్రమ రానివ్వనని హామీ ఇచ్చి, ఇప్పుడు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఈ పరిశ్రమ వల్ల మేమంతా గ్రామాలను వదిలివెళ్లాల్సి వస్తోందన్నారు. అనంతరం చినరాజప్ప విలేకరులతో మాట్లాడుతూ 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇస్తామంటూ సంబంధిత మంత్రి మభ్య పెట్టేందుకు చూస్తున్నారని, కేసులు ఎత్తేయండి అంటున్నారని, యాజమాన్యంపై దౌర్జన్యం చేశారంటూ ప్రభుత్వమే కేసులు పెట్టి, ఇప్పుడు యాజ మాన్యం కేసులు తీయడమేంటి అన్నారు. తెదేపా నిజనిర్ధారణ కమిటీ బాధితులను విడిపించేందుకు ప్రయత్నం చేస్తామంటూ ప్రజలకు, రైతులకు, మత్స్యకారులకు భరోసా ఇచ్చారు.

# వినియోగదారులకు చట్టరీత్యా రక్షణ



కాకినాడ రూరల్ : మార్కెట్లో కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యత విషయమై వినియోగదారులకు చట్టరీత్యా రక్షణ కల్పించేందుకు వినియోగదారుల రక్షణ చట్టం ఏర్పడిందని న్యాయవాది శ్రీలక్ష్మి అన్నారు.రమణయ్యపేట బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల రక్షణ చట్టం అమలు దినోత్సవం సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. నష్టపోయిన వినియోగదారుడికి ఎటువంటి ఖర్చు లేకుండా వీలైనంత త్వరగా నష్ట పరిహారం అందించడానికి చట్టం రూపొందిందని అన్నారు. వస్తువు కొన్న తర్వాత సేవలు అందించక పోయినా, అసంపూర్తి సేవలకు కూడా పరిహారం పొందవచ్చన్నారు.ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా బిల్లులు తీసుకున్నప్పుడే వినియోగదారుడికి హక్కు వస్తుందని శ్రీలక్ష్మి తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, కృష్ణ మోహన్, పద్మావతి, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన

# అత్యంత అధునాతనమైన ప్లానిటోరియం ప్రాజెక్ట్

-మెట్రోపాలిటన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు



వీఎంఆర్డీఏ : వీఎంఆర్డీఏ ప్రతిపాదిత ప్లానిటోరియం మ్యూజియంకి సంబంధించి నిర్మాణ మరియు సాంకేతిక పరిజ్ఞానం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్లానిటోరియం ఎక్విప్మెంట్ ప్రొవైడర్స్ అయిన ఇండియన్ ఇన్ఫోవిజన్ ప్రతినిధులు, ఇండియన్ ఆర్బిట్ ఏనిమేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, ఇంజనీర్ నారాయణరెడ్డి, ఆర్చిటెక్ట్ మరియు సంబంధిత అధికారులతో సహా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించిన మెట్రోపాలిటన్ కమిషనర్ కమీషనర్ శ్రీ పి. కోటేశ్వర రావు ఐఏఎస్; అదనపు కమిషనర్ మనజీర్ జీలానీ సామూన్ గురువారం వి.ఎం.ఆర్.డి.ఎ కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యంత అధునాతనమైన ప్లానిటోరియం నిర్మాణం విషయమై ఆర్కిటెక్చర్ పరంగా, సాంకేతికపరంగా ఎటువంటి అవాంతరాలు రాకుండా, ఇప్పటికే అందుబాటులో ఉన్న అత్యంత అత్యాధునిక ఆడియో, వీడియో మరియు ఎకోస్టిక్స్ విషయమై సుదీర్ఘంగా చర్చించి , తగు ఆదేశాలు జారీ చేసారు. సీటింగ్, డ్రోమ్ స్ట్రక్చర్ , డిజిటల్ ప్రొజెక్టర్, థియేటర్ లో ఉష్ణోగ్రత సమతుల్యత నిర్వహణ మరియు ఇతర సాంకేతిక అంశాలపై చర్చించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికై ఉపయోగించవలసిన సాంకేతిక పరిజ్ఞానం మరియు భవిష్యత్ లో చేయవలసిన మార్పులకు అనుగుణంగా, ఎటువంటి సాంకేతికతను అనుసరించాలో తదితర విషయాలపై సమీక్షించారు. ప్లానిటోరియం మ్యూజియం డోమ్ స్ట్రక్చర్ 15 డిగ్రీల టిల్ట్ యాంగిల్ లో 18 మీటర్ల వ్యాసం గల అర్ధగోళాకారంలో నిర్మాణం ఉంటుందని, ఈ ప్లానిటోరియం నిర్మాణం ఆప్టోమెకానికల్ మరియు డిజిటల్ 3డి, 2డి కాంబినేషన్ తో సహా 4 కె ప్రొజెక్షన్ సిస్టం అనుసరించి హైబ్రీడ్ సిస్టంతో రూపు దిద్దుకోబడుతోందని తెలిపారు. దేశ, విదేశీ విద్యార్థులను, పర్యాటకులను ఆకట్టుకునేలా, ఖగోళ శాస్త్రంలో విద్యా మరియు వినోదం కలిగించేలా... సమావేశాలు మరియు వర్కుషాప్స్ నిర్వహించుకునేలా.., అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దబోతున్నట్టు మరియు దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ గా రూపుదిద్దుకోబోతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో కార్యదర్శి గణేష్ కుమార్, కలకత్తా సైన్స్ మ్యూజియం పూర్వ క్యూరేటర్ డా .జీలానీ, చీఫ్ ఇంజనీర్ కె రామ్ మోహన్ రావు, కార్యనిర్వాహక ఇంజనీర్ భవాని శంకర్, ఎలక్ట్రికల్ కార్య నిర్వాహక ఇంజనీర్ సోమశేఖర్, కార్యనిర్వాహక ఇంజనీర్ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికై ఉపాధ్యాయులు ధర్నా




దేవరాపల్లి : ఉపాధ్యాయ బదిలీలకు నిరసనగా దేవరాపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ధర్నాలో ఉపాధ్యాయ సంఘ నాయకులు బోజంగి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యా యులపై అధికారుల నిరంకుశ వైఖరి విడనాడాలని, అక్రమ బదిలీలు నిర్వహించడంలో ఒక్క ఖాళీ కూడా బ్లాక్ చేయ కుండా ఉండాలని, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎం ఈ ఓ లకు కార్యాలయాలకు వెళ్లి ఆప్షన్స్ ఇవ్వాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి డిమాండ్ చేశారు. మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ ధర్నాలో ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా ఎప్ ఏపిటిఓ జనరల్ సెక్రెటరీ జి. శ్రీనివాసరావు, ఏపిటిఎఫ్ నాయకులు కె. రాంబాబు, సిరికి సింహాచలం నాయుడు, యుటిఎఫ్ నాయకులు ఎం. శేఖర్,అర్.ఎర్రయ్య దొర,సిహెచ్. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ డెయిరీ ద్వారా నగదు పంపిణీ



చెక్కులను అందజేస్తున్న దృశ్యం

మాకవరపాలెం : మాకవరపాలెం మండలంలో గురువారం పిపి అగ్రహారం, ఎర్రకన్నపాలెం గ్రామాల్లో చనిపోయిన రైతు కుటుంబాలకు విశాఖ డెయిరీ డైరెక్టర్ శ్రీరాంరెడ్డి, సూర్య నారాయణ రూ.2లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విశాఖడెయిరీ ఎంతో సహాయం చేస్తుందన్నారు. అనంతరం 9 మంది రైతులకు పాడి రైతుల సంక్షేమం ద్వారా రూ.2.35లక్షలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలను పరిశీలించిన

# సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య

గొలుగొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు కార్యక్రమంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ళ స్థలాల పంపిణీ పథకంలో భాగంగా అర్హులైన లబ్దిదారులందరికీ ఇళ్ళ పట్టాల పంపిణీ నర్సీపట్నం డివిజన్ పది మండలాల్లో డిసెంబర్ 25 నుండి జనవరి 7వ తేదీ వరకూ జరగనుంది. పట్టాల పంపిణీల పరిశీలన, ఏర్పాట్లులో భాగంగా నర్సీపట్నం సబ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య గురువారం గొలుగొండ మండలంలో పర్యటించారు. గొలుగొండ, ఏఎల్‌పురం, కేడిపేట, చీడికాడ రెవెన్యూ విలేజ్, పాతమల్లంపేట, ప్పుశెట్టిపాలెం, గుండుపాలెం, కె.ఎల్లపాలెం తదతర గ్రామాలను సందర్శించారు. సబ్ కలెక్టర్‌తో పాటు తహసీల్దార్ వెంకటేశ్వర రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పెదముషిడివాడలో పార్టీ కార్యాలయం ప్రారంభం

## ముఖ్య అతిథిగా బలిరెడ్డి అప్పారావు హాజరు



పరవాడ : పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామంలో పెదముషిడివాడ పంచాయతీ ప్రెసిడెంట్ అభ్యర్థి బలిరెడ్డి అప్పారావు నూతన కార్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బలిరెడ్డి అప్పారావు యువజన సంఘం నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెనుగుపూడి గురుకులం పై ప్రిన్సిపల్ సెక్రటరీకు ఫిర్యాదు



దేవరాపల్లి : మండలంలోని తెనుగు బూడి గురుకుల పాఠశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్రమైన ధర్యాప్తు జరిపించి దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి మెయిల్ ద్వారా పిర్యాదు చేసినట్లు ఆయన గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ

తెనుగుబూడి గురుకుల పాఠశాలలో గతరెండు సంవత్సరాలుగా నిరంతరం ఎదో ఒక సమస్యవస్తూనే ఉంది.

దీన్ని పరిష్కారం చేయవలసిన అదికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తు నోరు మెదపడం లేదని ఆరోపించారు. దీనివలన విద్యార్థులులో రానురాను క్రమశిక్షణ, ఉత్తీర్ణత శాతం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. వెంటనే దీనిపై సమగ్రమైన దర్యాప్తు జరిపించి పాఠశాలలో పరిస్థితులు మేరుగుపర్చాలని దీనికి కారణం అయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కాపీ ప్రతులను జిల్లా కలెక్టర్, ఏ పీ సోషల్ వేల్ఫ ర్ డీసిఓలకు సమర్పించామని పేర్కొన్నారు.



## వేణుంబాక విజయసాయిరెడ్డి

రాజ్యసభ సభ్యుడు, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు

విజయవాడలో వంగవీటి రంగా హత్య కేసులో నిందితుడైన వెలగపూడి రామకృష్ణ బాబు దేవుడి మీద ప్రమాణం చేస్తానని సవాల్ విసిరినట్టుగా మీడియా లో చూశాను. రామకృష్ణ బాబు అండ్ కో కలిసి చంపేసిన వంగవీటి మీద అయినా ప్రమాణం చేయగలడు, చంద్రబాబు వల్ల మరణించిన ఎన్టీఆర్ మీద అయినా ప్రమాణం చేయగలడు, తన భార్య మీద అయినా ప్రమాణం చేయగలడు, తన పిల్లల మీద అయినా ప్రమాణం చేయగలడు. ఎందుకంటే, దేవుడు అంటే నమ్మకం లేదు, పాప భీతి లేదు కాబట్టే, వంగవీటి హత్య తర్వాత విశాఖకు పారిపోయి వచ్చాడు. విశాఖ వచ్చిన వెలగపూడి ఏం చేశాడంటే.. భూములు మేశాడు, పీకలు కోశాడు అని అనేక మంది చెబుతున్నారు. ఈయనకు బినామీ భూములు లేవని ప్రమాణం చేస్తాడా..?, బినామీ భూములు లేకపోతే ఎందుకు ఉలికిపాటుకు గురి అవుతున్నాడు, ఎందుకు తన అస్తులన్నీ పోయినట్టు బాధపడుతున్నాడు?. తనకు ఒక్క అంగుళం భూమి కూడా లేకపోతే బదులు తీర్చుకుంటానని ఎందుకు ప్రగల్భాలు పలుకుతున్నాడు?. ఈ విషయాలన్నింటికీ అతనే సమాధానం చెప్పాలి. విశాఖపట్నంలో వెలగపూడి రామకృష్ణను ఎవరైనా ధర్మాత్ముడు అనుకుంటారా లేక ఒక గూండా, రౌడీ ఎలిమెంటుగా భావిస్తున్నారా.. ?. రాక్షసత్వం నిండిన వ్యక్తి దేవుడి మీద ప్రమాణం చేయటం ఏమిటి? వినటానికి కూడా వెగటుగా ఉంది.

# భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సేవలందించాలి

## - భక్తుల సౌకర్యార్థం పది రోజులపాటు వైకుంఠ ద్వారం తెరిచి ఉంచుతాం
## - తిరుమలకు వచ్చే భక్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలి
### - టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

తిరుమల/ తిరుపతి: శ్రీవారి సేవకులు (స్వామివారికి ఉచితసేవ చేయువారు) భక్తులకు అందిస్తున్న సేవలను కొనయాడుతూ...వైకుంఠ ఏకాదశి సందర్భంగా వచ్చే భక్తులకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా సేవలందిచాలని సేవకులకు టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి సూచించారు. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి టీటీడీ అధికారులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి పర్వదినం భక్తుల సౌఖర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి సందర్భంగా పది రోజుల పాటు వైకుంఠ ద్వారం తెరిచే ఉంచుతామని తెలియజేశారు.దేశ వ్యాప్తంగా ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులు సూచనల మేరకు వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం పది రోజులు తెరిచే ఉంచుతామన్నారు.

కోవిడ్ నింబంధనలు మేరకు 35 వేల నుండి 40 వేల మంది భక్తులను మాత్రమే అనుమతి ఇస్తున్నామని భక్తులు సహకరించాలని కోరారు.

ఆన్ లైన్ లో 20 వేలు,ఆఫ్ లైన్ ద్వారా 10 వేల టిక్కెట్లు జారీ చేసాం.తిరుపతిలో జారీ చేసిన టిక్కెట్లు కేవలం స్థానికులను మాత్రమే అనుమతించాం..ఈ ఏడాది వైకుంఠ ఏకాదశి పర్వదినం శుక్రవారం రావడం కారణంగా నేటి ఉదయం స్వామి వారికి ధనుర్మాసం కైంకర్యాలు పూర్తి అయిన తరువాత ఉదయం 4 గంటలకు భక్తులకు స్వామి వారిని దర్శించేందుకు అనుమతి ఇస్తామన్నారు.నేటి ఉదయం 4 గంటల నుండి 7: 30 గంటల వరకూ వి.ఐ.పి భక్తులను,7:30 గంటల నుండి సామాన్య భక్తులను అనుమతిస్తాం.తిరుమలకు విచ్చేసే ప్రతి భక్తుడు కోవిడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి.

4 లక్షల పైగా లడ్డూ ప్రసాదాలను భక్తుల సౌకర్యార్థం ఉంచాం.



శ్రీవాణి ట్రస్టు ద్వార 70 శాతం మంది భక్తులు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు..

వైకుంఠ ఏకాదశి రోజు స్వర్ణరథం లాగేందుకు టీటీడీ మహిళా ఉద్యోగులను మాత్రమే అనుమతిస్తున్నాం.

మహిళా ఉద్యోగులకు ముందస్తుగా 200 మందికి కోవిడ్ పరిక్షలు నిర్వహించాం.

ద్వాదశి రోజు నిర్వహించే చక్రస్నానం మహోత్సవంను ఏకాంతంగా నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి తెలియజేశారు

# శాంతి సమానత్వానికి క్రీస్తు బోధనలు ఎంతో అవసరం

### - మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నం : రాష్ట్రం ప్రజలకు ,ప్రేత్యేకంగా క్రిస్టియన్ సోదర ,సోదరీమణులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు శు భాకాంక్షలు తెలిపారు. కరోన మహమ్మారి నేపధ్యంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలని మంత్రి తెలిపారు. ఏసుక్రీస్తు సూచించిన శాంతి, సహనం, ప్రేమ , కరుణ , జాలి, దయ అనే గుణాలను, ప్రతి ఒక్కరు కలిగి ఉండాలి. ప్రతి ఒక్కరు క్షమగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖ సంతోషాలతో ఉంటుందన్నారు. ఇతరుల పట్ల ప్రేమ తో మెలగాలని.. కరుణను చూపాలని జీసస్ విశ్వానికితెలియజేశారని..అంతే కాకుండ తొలుత వారు ఆచరించిచూపారని అటువంటి కరుణామయుని పుట్టినరోజుని విశ్వవ్యాప్తంగా జరుపుకునే పండగ అని తెలిపారు. ఆ జీసస్ దీవెనలు అందరికి ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భూమి పై మనవరూపంలో జన్మించిన ఏసుక్రీస్తు మనుషుల పాపాలను కడిగి వేసి వారిలో ప్రేమ , దయ, జాలిగుణం అలవర్చారన్నారు.

పేద ప్రజల ఆశాజ్యోతి, ఆపద్బాంధవుడు ప్రజల కష్టాలను చూసి జనరంజక పాలన లో పేద ప్రజలకు చిరకాల వాంఛ గా మిగిలిన సొంతింటి కలను పండుగ వాతావరణంలో రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 25 న ముక్కోటి ఏకాదశి క్రిస్టమస్ పండుగ రోజున పట్టాభిషేకం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి తెలిపారు. సీఎం జగన్మోహన్ రెడ్డి సుఖ సంతోషాలతో.. అయూఆరోగ్యాలతో ఉండాలని ప్రతి ఒక్కరు ప్రార్థించాలని పాస్టర్లను, సిస్టర్స్ ను మంత్రి కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల పైబడి పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరుగుతుందన్నారు. ఒక పవిత్రమైన రోజు ముక్కోటి ఏకాదశి క్రిస్మస్ పండుగ రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఒక బృహత్తరమైన కార్యక్రమాన్ని చేపట్టారని టిడిపి నాయకులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా పేద ప్రజల సంక్షేమమే సొంతింటి కల సహకారమే లక్ష్యంగా ఇళ్ల పట్టాల పండుగ జరుగుతుంది అని ఇది పూర్తిగా పేద ప్రజల ప్రభుత్వం అని మంత్రి చెప్పారు.

*విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ అందరికీ ఇల్లు పథకం ద్వారా సుమారుగా 40,000 మందికి ఇళ్ల పట్టాలు ఈ నెల30వ తేదీ న పంపిణీ కి విశాఖ దక్షిణం లో ఇందిరా ప్రియ దర్శిని మునిసిపల్ స్టేడియాన్ని సందర్శించి తగు సదుపాయాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులు జోనల్ కమిషనర్ ఫణిరామ్, డీ.ఈ.ఈ సంతోషి కుమారి, ఏ.ఈ.ఈ ఉషారాణి లకు ఆదేశించారు.*

*ఈ కార్యక్రమం లో మాజీ యూత్ లీడర్ విళ్లూరి భాస్కర రావు, రాష్ట్ర యూత్ సెక్రెటరీ అదివిష్ణు, యాసిన్, నౌషాద్, సంకర రావు, ఆలీ, ఆశి, నిఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.*



# పిల్లలకు సత్ప్రవర్తన నేర్పడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే కీలకం

### - విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి.రంగారావు



విశాఖ రూరల్ : యువతీ, యువకులు తెలిసీ తెలియని వయస్సులో, అవగాహన లేకుండా చేసే పనుల వలన, ప్రేమ ఉచ్చులోపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి.రంగారావు, ఐపిఎస్ డిసెంబరు 24, గురువారం నాడు అన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండని అమ్మాయిలతో, వారి ఇష్ట పూర్వకంగా శారీరక సంబంధాలు పెట్టుకున్నా, ఇతర ప్రాంతాలకు తీసుకొని వెళ్ళినా, ప్రేమ వ్యవహారాలు నడిపినా చట్టరీత్యా నేరమేనన్నారు.

యువతీ, యువకులకు చట్టం పట్ల అవగాహన లేకపోవడం వలన ఇటువంటి వ్యవహారాల్లో ఇరుక్కొని దురదృష్టవసాత్తు దోషులుగా మారుతున్నారన్నారు. ఈ తరహా నేరాలకు పోక్సో చట్టం క్రింద కఠినమైన శిక్షలు ఉన్నాయన్నారు. ఇటువంటి వ్యవహారాల్లో ఇరుక్కోవడం వలన ఉన్నత స్థితికి వెళ్ళవలసిన యువతీ, యువకులు తమ భవిష్యత్తును నాశనం చేసుకొంటున్నా రన్నారు.

పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనన్నారు. తమ పిల్లలు ఏమి చేస్తున్నారన్న విషయాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని, వక్రమార్గంలో వెళ్ళే వారిని సన్మార్గంలో పెట్టి, వారికి దిశా నిర్దేశం చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో సన్నిహితంగా, ప్రేమతో మెలగడం వలన పిల్లలు తప్పు దారుల్లో నడిచే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన పిల్లలు, అటువంటి ప్రేమను ఇతరుల నుండి పొందేందుకు ప్రయత్నిస్తుంటారన్నారు. కావున, తల్లిదండ్రులు ఇటువంటి విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలని, తమ కు ప్రేమ, వాత్సల్యాన్ని చూపాలని, వారితో స్నేహంగా, సన్నిహితంగా మెలగాలని, పిల్లలు తమ ఇబ్బందులను, అభిప్రాయాలను స్వేచ్ఛగా వారి తల్లిదండ్రులతో పంచుకొనే అవకాశంను, వాతావరణాన్ని కల్పించాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి.రంగారావు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

ఆన్ లైను, మొబైలు యా తో రుణాలను సులువుగా మంజూరు చేస్తామని చెప్పే వ్యక్తులు, సంస్థలుపట్ల అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి.రంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల కాలంలో మొబైలు యాప్ లతో తక్కువ వడ్డీకి, సులువుగా రుణాలు మంజూరు చేస్తామని, ప్రజలను నమ్మించి, మోసగించే అనధికార సంస్థలు, మొబైలు యాట్లు పుట్టుకొస్తున్నాయన్నారు. ఇటువంటి సంస్థలు, వ్యక్తుల ఉచ్చులో పడవద్దన్నారు. మొబైల్ యాప్ లో వారు అడిగిన వివరాలను అందించండం వలన మన పూర్తి సమాచారం సైబరు నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోయి, వేధింపులకు గురవుతున్నా రన్నారు.

కెవైసి డాక్యుమెంట్లును అపరిచిత వ్యక్తులకు, అనధికార సంస్థలకు ఇవ్వొద్దన్నారు. ఈ తరహా సంస్థలు రుణాలు తీసుకున్న వ్యక్తుల నుండి 20-30 శాతం వివిధ కారణాలతో అదనపు చార్జీలు, అధిక వడ్డీలను వసూలు చేయడం చేస్తున్నా యన్నారు. మొబైల్ కు వచ్చే లింకులు, మెసేజ్ లకు స్పందించ వద్దని, వడ్డీలు వసూలు చేసేందుకు వేధింపులకు పాల్పడుతున్న అనధికార ఆన్ లైను సంస్థలు, మొబైలు యాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి.రంగారావు ప్రజలకు పిలుపునిచ్చారు.

## నగర పరిధిలో కోవిడ్ - 19 వాక్సిన్ పంపిణీపై

# వివిధ శాఖల అధికారులకు అవగాహన

విశాఖపట్నం : త్వరలో నగరపరిధిలో చేపట్టబోయే కోవిడ్-19 వాక్సిన్ పంపిణీ విదివిధానాలపై జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన మరియు డి.ఎం.ఓ.హెచ్ సూర్యనారాయణతో కలసి వివిధ శాఖల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. గురువారం, జివిఎంసి సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ వాక్సిన్ ముఖ్యంగా మూడు విధాలుగా విభజించి ఇస్తారని, మొదటి దశలో హెల్త్ కేర్ వర్కర్ల కు, రెండవ దశలో పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు శాఖలకు, మూడవ దశలో 50 సంవత్సరములు నిండిన వారికి మరియు 50 సంవత్సరములు లోపుల ఉన్న వ్యక్తులకు బి.పి., షుగర్ లేదా దీర్ఘకాలపు వ్యాధి ఉన్న వారికి ఇస్తారని అందుకు మీ అందరి సహకారం అవసరమని తెలిపారు.

డి.ఎం.ఓ.హెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ, భారతదేశం నుండి పోలియో వ్యాధిని లేకుండా చేసి అలాగే ఈ కోవిడ్-19 భారతదేశం నుండి పారదోరాలని, అందుకు గాను వాక్సిన్ వేసేందుకు అనువుగా ఉన్న మెడికల్ కాలేజీలు, స్కూళ్లు, కమ్యూనిటీ హాలులు మొదలైనవి గుర్తించి, మూడు రూములు ఉండే విధంగా మొదటి రూమ్ వ్యక్తి యొక్క అధార్ డాటా తనిఖీ, రెండవ రూములో వాక్సిన్ ఇవ్వడం, మూడవ రూములో 30 నిముషాల పాటు ఆరోగ్య పరిశీలన చేసి పంపించాలని అన్నారు.

తదుపరి జివిఎంసి సి.ఎం.ఓ.హెచ్. కె.ఎస్.ఎల్.జి. శాస్త్రి మాట్లాడుతూ కోవిడ్ వాక్సిన్ కు పోలీసు, రైల్వే, సోషల్ వెల్ఫేర్, మీడియా సెల్, డిఫెన్సు, డి.ఇ.ఓ., లేబర్ ఎంప్లాయిమెంట్, అర్బన్ డిపార్ట్మెంట్ మొదలైన శాఖల సహకారం అవసరమని, ముఖ్యంగా కోవిడ్ వాక్సిన్ వేసినప్పుడు రద్దీ లేకుండా చూడాలని, అందుకు



ఎన్.ఎస్.ఎస్, ఎన్.వై.కె.ఎస్ మరియు ఏ.ఎన్.ఎం.లు ఎక్స్-సర్వీస్ మెన్స్, ఎస్.హెచ్.జి. గ్రూప్స్, హోమ్ గార్డ్స్, తదితరుల సహాయ సహకారం తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డి.ఎం.ఓ.హెచ్ సూర్యనారాయణ, డి.ఐ.ఓ. డా. జీవన్ రాణి, డబ్ల్యూ.హెచ్.ఓ. డా. భవాని, యు.ఎన్.డి.పి. కమలాకర్, యు.ఎన్.ఐ.డబ్ల్యూ. డా. విక్రం, సి.పి.ఎం.ఓ.ఎన్.ఓ.హెచ్.ఎం. వెంకట రమణ, ఏ.సి.ఎం.డి. లక్ష్మణ రావు, రెండవ పట్టణ సర్కిల్ ఇన్ స్పెక్టర్ కె. వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.



*జీవీఎంసీ కమిషనర్ డా. సృజన ని కలిసి విశాఖ పశ్చిమ నియోజకవర్గం 14 వార్డులో ఉన్న పలు సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరి, అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఇళ్ల పట్టాల పంపిణీ మరియు టిడ్కో ఇళ్ల పంపిణీ కొరకు చర్చించిన మాజీ శాసనసభ్యులు, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్.మళ్ల విజయ్ ప్రసాద్*

## రూ.4,109 కోట్ల అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తు

హైదరాబాద్ : అగ్రిగోల్డ్‌కు చెందిన 4,109 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను ఈడీ(ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) తాత్కాలికంగా జప్తు చేసింది. గురువారం ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశాలలోని అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకుంది. ఏపీలో 56 ఎకరాల హాయ్‌లాండ్ ఆస్తులు.. పలు కంపెనీల్లో వాటాలు, యంత్రాలను అటాచ్ చేసింది. కాగా, బుధవారం అగ్రిగోల్డ్ చైర్మన్ అవ్వా వెంకట రామారావు, డైరెక్టర్లు శేషు నారాయణ రావు, హేమ సుందర వరప్రసాద్ రావును ఈడీ అధికారులు కోర్టులో హాజరుపరిచిన సంగతి తెలిసిందే. వీరికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, వారిని చంచల్ గూడ జైలుకు తరలించారు. అగ్రిగోల్డ్ సుమారు 32 లక్షల మంది వద్ద 6,380 కోట్ల రూపాయల మోసానికి పాల్పడినట్లు ఈడీ అధికారులు కనుగొన్నారు. 942 కోట్ల రూపాయల డిపాజిటర్ల సొమ్మును ఇతర వ్యాపారాలకు మళ్లించినట్లు గుర్తించారు.

# రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఏయూ విద్యార్థులు ఎంపిక

### ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ఆంధ్రాయూనివర్సిటీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరికి వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి గురువారం తన కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వీరిలో 5గురు ఏయూ విద్యార్థులు కావడం పట్ల వీసీ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఏయూ విద్యార్థులు ఎంపిక కావడం వర్సిటీ ప్రతిష్టను ఇనుమడింప చేయడమన్నారు. ఇటువంటి అవకాశాలు విద్యార్థి జీవితంలో అరుదుగా వస్తాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపికైన విద్యార్థులు... : రెండు దశల్లో జరిగిన ఎంపికల్లో ఏయూ పరిధిలో 5గురు విద్యార్థులు ఎంపికయ్యారు. దేశ వ్యాప్తంగా 200 మంది వలంటీర్లను రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనడానికి ఎంపిక చేశారు. వీరిలో మన రాష్ట్రం మెత్తం నుంచి 10 మంది ఎంపిక కాగా, ఏయూ నుంచి 5 వలంటీర్లు ఎంపికయ్యారు. డి.యువరాజు, బి.అనీల్ కుమార్, బి.గాయత్రి తుషార, బూసి ఏంజిలీనా, మేరుగు భావనలు ఎంపికయ్యారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, ఏయూఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్, ఎన్ఎస్ఎస్ రాష్ట్ర ఇటిఐ కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com